# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



విలేకరులు కావలెను

http://vaasthavanestham.com

వాస్తవ నేస్తం తెలుగు దిన పత్రిక ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...

సంప్రదించండి

తెలంగాణ 8099779988

ఆంధ్రప్రదేశ్ 9985337979



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో

వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన

- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 సంచిక : 208 ఆదివారం 4 ఫిబ్రవరి 2024 పేజీలు : 8 వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri




# పక్కా వ్యూహంతో కాషాయం?

- తెలంగాణపై స్పెషల్ ఫోకస్
- తెలంగాణలో ఎంపీ సీట్ల కోసం రథయాత్ర
- ఇప్పటికే పార్లమెంట్ సెగ్మెంట్ల వారీగా సమీక్షలు, సమావేశాలు
- పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రమే మెజార్టీ సీట్లను గెలుచుకోవాలని భావిస్తోంది బీజేపీ
- గత లోక్ సభ ఎన్నికల్లో ఏకంగా 4 ఎంపీ స్థానాలను గెలిచి సత్తా చాటింది
- ఈసారి మాత్రం రెండంకెల సంఖ్యను దాటాలని చూస్తోంది.

పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధమవుతోంది బీజేపీ తెలంగాణ. ఇప్పటికే పార్లమెంట్ సెగ్మెంట్ల వారీగా సమీక్షలు, సమావేశాలు నిర్వహిస్తూ వస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆశించిన మేర సీట్లు రాకపోవటంతో వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రమే మెజార్టీ సీట్లను గెలుచుకోవాలని భావిస్తోంది.

-3లో



## యూఎస్ ప్రతీకార దాడులు..

- ఆరుగురు ఉగ్రవాదులు మృతి!
- ఇరాన్ మద్దతు కలిగిన మిలీషియా స్థావరాలపై బాంబు దాడి
- యూఎస్ దళాలు 125కు మించిన యుద్ధ సామగ్రితో 85కు మించిన లక్ష్యాలపై దాడి

## తెలంగాణాలోనూ.. ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్




- లోక్ సభ ఎన్నికలు ఉన్నందున ఏడాది మొత్తం బడ్జెట్ పెట్టే వీలు లేదు.
- ఎన్నికలకు ముందు ఓటాన్ అకౌంట్‌ను, ఎలక్షన్ల తర్వాత పూర్తి స్థాయి బడ్జెట్‌ను శాసనసభకు సమర్పించనున్న రేవంత్ సర్కార్
- ఎన్నికల నేపథ్యంలో జీతాలు, భత్యాలు, ఇతరత్రా నిర్వహణ ఖర్చులను ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ వరకు కోసం ఓటాన్ అకౌంట్‌ను ప్రవేశపెట్టి, శాసనసభ అనుమతి తీసుకోనున్న సర్కార్


హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రతిపాదించాలని నిర్ణయించుకున్నట్లుగా తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వం ఎన్నికలకు వెళ్తోంది. లోక్ సభ ఎన్నికలు ఉన్నందున ఏడాది మొత్తం బడ్జెట్ పెట్టే వీలు లేదు. అందుకే ఓటాన్ అకౌంట్ పద్దునే ప్రవేశ పెడతారు. ఇందులో తాత్కాలిక కేటాయింపులే ఉంటాయి. పూర్తి బడ్జెట్ లో రాష్ట్రాలకు కేటాయించే గ్రాంట్లపై స్పష్టత వస్తుంది. అందుకే కేంద్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడి పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశ పెట్టిన తర్వాతనే తెలంగాణనూ బడ్జెట్ పెట్టాలని అనుకుంటున్నారు. ముందుగా ఓటాన్ అకౌంట్ పెట్టాలని భావిస్తున్నారు. రేవంత్ సర్కార్ -మిగతా3లో

## అద్వానీకి భారతరత్న..

- ఎంతో ఆనందంగా ఉందన్న మోదీ!
- అద్వానీకి దేశ అత్యున్నత పౌర పురస్కారం భారతరత్నను ప్రకటించిన భారత ప్రభుత్వం
- అద్వానీతో మాట్లాడి, అభినందనలు తెలియజేశానన్న మోదీ
- దేశానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమైనవన్న ప్రధాని





## ప్రముఖ బ్యాంకును అమ్మనున్న కేంద్రం..!

- వ్యూహాత్మక విక్రయాల్లో భాగంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంటోంది
- తాజాగా ప్రముఖ బ్యాంకులోని ప్రభుత్వ వాటాను విక్రయించేందుకు సన్నద్ధం
- రాబోయే ఆర్థిక సంవత్సరంలో ఐడీబీఐ వ్యూహాత్మక విక్రయం పూర్తవుతుందన్న ధీమా

# గ్రామాల అభివృద్ధితోనే ప్రజల జీవితాల్లో మార్పులు



- దళిత కాలనీల్లో తాగునీరు, మురికి కాలువలు, విద్యుత్ స్తంభాల సమస్యలు పరిష్కరిస్తాం
- ధరణి తీసివేసిన తర్వాత భూమి సమస్యలు తీర్చి, భూమిపై హక్కులు కల్పిస్తాం
- మానవతా దృక్పథంతో ఇద్దరు ఆడపిల్లలకు ఒక్కొక్కరికి రూ. 50వేల ఇద్దరికీ డిపాజిట్ చేస్తామని హామీ
- మంచి నడవడి, మంచి ఆలోచనలు చదువు ముఖ్యం

హైదరాబాద్

గ్రామాల అభివృద్ధినే ప్రజల జీవితాల్లో మార్పులు వస్తాయని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. మెదక్ జిల్లా రేగోడ్ మండలంలోని టీ లింగంపల్లి, మర్పల్లి, ఆర్ ఇటిక్యాల, జగిర్యాల గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన దళిత కాలనీల్లో తాగునీరు, మురికి కాలువలు, విద్యుత్ స్తంభాల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ధరణి తీసివేసిన తర్వాత భూమి సమస్యలు తీర్చి, భూమిపై హక్కులు కల్పిస్తామన్నారు. మానవతా దృక్పథంతో ఇద్దరు ఆడపిల్లలకు ఒక్కొక్కరికి రూ. 50వేల ఇద్దరికీ డిపాజిట్ చేస్తామని హామీ ఇచ్చారు. మెదక్ మండలం రేగొడులో కస్తూరీబా గాంధీ బాలిక విద్యాలయం, మోడల్ స్కూల్, కళాశాలలో జరిగిన -మిగతా3లో

# యూఎస్ ప్రతీకార దాడులు



జోర్డాన్‌లోని సైనిక స్థావరంపై డ్రోన్ దాడికి ప్రతిగా యూఎస్ మిలటరీ ఇరాక్‌లోని ఇరాన్ మద్దతు కలిగిన మిలీషియా స్థావరాలపై బాంబు దాడి చేసింది. మీడియాకు అందిన సమాచారం ప్రకారం సిరియాలో జరిగిన యూఎస్ వైమానిక దాడుల్లో ఆరుగురు మిలీషియా ఫైటర్లు మరణించారు. వారిలో ముగ్గురు నాన్ సిరియన్లు. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ మద్దతు కలిగిన 85 మిలీషియా స్థావరాలపై అమెరికా ప్రతీకార వైమానిక దాడులను ప్రారంభించిందని యూఎస్ మిలిటరీ ఒక ప్రకటనలో తెలిపింది.

కంట్రోల్ సెంటర్లు, రాకెట్, క్షిపణి, డ్రోన్ నిల్వల గోడౌన్‌లతో పాటు లాజిస్టిక్స్ సౌకర్యాలను లక్ష్యంగా చేసుకుని యుఎస్ సైనిక వైమానిక దాడులు జరిపినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. యూఎస్ దళాలు 125కు మించిన యుద్ధ సామగ్రితో 85కు మించిన లక్ష్యాలపై దాడి చేశాయి. అదే సమయంలో సిరియాలోని ఎడారి ప్రాంతాలు, ఇరాక్ సరిహద్దు సమీపంలో ఉన్న లక్ష్యాలపై అమెరికా జరిపిన దాడిలో పలువురు మృతి చెందారని, చాలామంది గాయపడ్డారని సిరియా ప్రభుత్వ మీడియా తెలిపింది.

ఈ దాడుల తరువాత అమెరికా అధ్యక్షుడు బైడెన్ ఒక ప్రకటనలో అమెరికన్లకు ఎవరైనా హాని కలిగిస్తే, తాము తగిన సమాధానం ఇస్తామని అన్నారు. గత ఆదివారం జోర్డాన్‌లో ఇరాన్ మద్దతుగల ఉగ్రవాద గ్రూపులు జరిపిన డ్రోన్ దాడిలో ముగ్గురు అమెరికా సైనికులు మరణించారని ఆయన చెప్పారు. శుక్రవారం డోవర్ ఎయిర్‌ఫోర్స్ బేస్‌లో వీర జవాన్లకు నివాళులర్పించే కార్యక్రమంలో బైడెన్ పాల్గొన్నారు. గత వారంలో జోర్డాన్‌లోని సైనిక స్థావరంపై జరిపిన డ్రోన్ దాడిలో ముగ్గురు యూఎస్ సైనికులు మృతిచెందారు. ఈఘటనలో సుమారు 40 మంది గాయపడ్డారు. ఈ నేపథ్యంలోనే అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఇరాన్ మద్దతు కలిగిన ఉగ్రవాద గ్రూపులపై ప్రతీకార దాడులు ప్రారంభించారు.

# అద్వానీకి భారతరత్న..


FILE PHOTO

బీజేపీ అగ్రనేత, రాజకీయ కురువృద్ధుడు అద్వానీని భారత ప్రభుత్వం దేశ అత్యున్నత పౌర పురస్కారం భారతరత్నకు ఎంపిక చేసింది. ఈ విషయాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్ వేదికగా ప్రకటించారు. "ఎల్కే అద్వానీ గారికి భారతరత్న పురస్కారం ఇవ్వబడుతోందనే విషయాన్ని పంచుకోవడం చాలా సంతోషంగా ఉంది. ఆయనతో నేను మాట్లాడాను. ఈ పురస్కారాన్ని పొందబోతున్నందుకు అభినందనలు తెలియజేశాను. సమకాలీన అత్యంత గౌరవనీయులైన రాజనీతిజ్ఞులలో అద్వానీ ఒకరు. మన దేశ అభివృద్ధికి ఆయన చేసిన సేవలు, కృషి చిరస్మరణీయమైనవి.

అట్టడుగు స్థాయిలో పని చేయడం దగ్గర నుంచి దేశానికి ఉప ప్రధానమంత్రిగా చేయడం వరకు ఆయన జీవితం ఎంతో ఉన్నతమైనది. దేశ హోంమంత్రిగా, సమాచారశాఖ మంత్రిగా కూడా ఆయన సేవలందించారు. ఆయన పార్లమెంటరీ అనుభవం ఎంతో ఆదర్శప్రాయమైనది, ఎంతో ఆలోచనప్రాయమైనది.

సుదీర్ఘమైన దశాబ్దాల ప్రజా జీవితంలో ఆయన అనుసరించిన పారదర్శకత, సమగ్రత రాజనీతిలో ఆదర్శప్రాయమైన ప్రమాణాలను నెలకొల్పాయి. జాతీయ ఐక్యత, సాంస్కృతికతను పెంపొందించే దిశగా అసమానమైన కృషి చేశారు. ఆయనకు భారతరత్న రావడం నన్ను భావోద్వేగానికి గురి చేస్తోంది. ఆయనతో సంభాషించడానికి, ఆయన నుంచి నేర్చుకోవడానికి నాకు లెక్కలేనన్ని అవకాశాలు రావడాన్ని నేను ఎప్పుడూ అదృష్టంగా భావిస్తాను" అని మోదీ ట్వీట్ చేశారు. అద్వానీతో దిగిన ఫొటోలను కూడా మోదీ షేర్ చేశారు. అద్వానీకి భారతరత్న పురస్కారం దక్కడంపై పార్టీలకు అతీతంగా హర్షం వ్యక్తమవుతోంది.

**బీజేపీ 'రథ యాత్రికుడు' అద్వానీ!**

భారత అత్యున్నత పౌర పురస్కారమైన భారతరత్నను మాజీ ఉప ప్రధాని, బీజేపీ సీనియర్ నేత లాల్ కృష్ణ అద్వానీ(96)కి అందజేయనున్నట్లు ప్రధాని మోదీ ప్రకటించారు. ఈ నేపథ్యంలో అద్వానీ జీవితంలో చోటుచేసుకున్న ఆసక్తికర అంశాలను తెలుసుకుందాం. లాల్ కృష్ణ అద్వానీ అసలు పేరు లాల్ కిషన్‌చంద్ అద్వానీ. అతని ప్రారంభ విద్య కరాచీలో సాగింది. తరువాత లాహోర్‌లో చదువుకున్నారు. అనంతరం ముంబైలోని ప్రభుత్వ న్యాయ కళాశాల నుంచి పట్టభద్రుడయ్యారు. బీజేపీని ఇప్పుడున్న ఉన్నత స్థాయికి తీసుకువచ్చిన ఘనత లాల్ కృష్ణ అద్వానీకే దక్కుతుంది. ఇద్దరు ఎంపీల స్థాయి కలిగిన బీజేపీని 150 మంది ఎంపీలు ఉన్న పార్టీగా రూపొందించిన ఘనత అద్వానీకే దక్కుతుంది.

అద్వానీ చదువుకునే సమయంలో ఆర్ఎస్ఎస్‌లో చేరారు. 1947లో కరాచీలోని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కార్యదర్శిగా నియమితులయ్యారు. డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ 1951లో జన్ సంఘ్‌ను స్థాపించినప్పుడు, ప్రారంభ సభ్యులలో అద్వానీ కూడా ఒకరు. 1957 వరకు అద్వానీ సంఘ్ కార్యదర్శిగా కొనసాగారు. జన్ సంఘ్‌లో ముఖ్యమైన పదవుల్లో పనిచేసిన తర్వాత 1972లో అద్వానీ సంఘ్ అధ్యక్షునిగా ఎన్నికయ్యారు.

తరువాత ఆ పార్టీ జన్ సంఘ్ నుండి బీజేపీగా మారినప్పుడు.. అంటే 1980లో పార్టీ స్థాపించినప్పటి నుండి 1986 వరకు లాల్ కృష్ణ అద్వానీ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. అనంతరం 1986 నుంచి 1991 వరకు పార్టీ అధ్యక్ష బాధ్యతలు నిర్వహించారు. 90వ దశకంలో లాల్ కృష్ణ అద్వానీ, అటల్ బిహారీ వాజ్‌పేయి ద్వయం భారత రాజకీయాలలో కీలక వ్యక్తులుగా మారారు. రామాలయ ఉద్యమాన్ని ఉన్నత స్థితికి తీసుకెళ్లారు. ఒకదాని తర్వాత ఒకటిగా అద్వానీ చేపట్టిన యాత్రల ఫలితం అతి తక్కువ వ్యవధిలోనే భారతీయ జనతా పార్టీ ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకుంది. అలాగే పలు రాష్ట్రాల్లో ఆ పార్టీ అధికారంలోకి వచ్చింది.

అద్వానీ, అటల్ బిహారీ వాజ్‌పేయి జంట 1996 లోక్‌సభ ఎన్నికలలో భిన్నమైన చరిత్రను సృష్టించింది. 1996లో తొలిసారి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. వాజ్‌పేయి ప్రధానమంత్రిగా, అద్వానీ హోంమంత్రిగా పదవులు చేపట్టారు. ఆలయ ఉద్యమం తర్వాత, అద్వానీకి ప్రజాదరణ తారాస్థాయికి చేరింది. దీంతో అద్వానీని ప్రధానిని చేయాలనే ఆలోచన నాటి బీజేపీ నేతలలో కలిగింది. అయితే అద్వానీ స్వయంగా అటల్ బిహారీ వాజ్‌పేయి పేరును ప్రధాని పదవికి సూచించారని చెబుతారు. కాగా అద్వానీ అరడజనుకు పైగా రథయాత్రలు చేపట్టారు. వాటిలో 'రామ రథ యాత్ర', 'జనదేశ్ యాత్ర', 'స్వర్ణ జయంతి రథయాత్ర', 'భారత్ ఉదయ్ యాత్ర','భారత్ సురక్ష యాత్ర' ముఖ్యమైనవి.

# దేశ అత్యున్నత పురస్కారం అందుకున్న ప్రముఖులు వీరే

రాజకీయ కురువృద్ధుడు, బీజేపీ అగ్రనేత ఎల్.కె. అద్వానీని కేంద్ర ప్రభుత్వం దేశ అత్యున్నత పౌర పురస్కారం భారత రత్నతో సత్కరించింది. ఈ విషయాన్ని ప్రధాని నరేంద్రమోదీ శనివారం 'ఎక్స్ (ట్విటర్)' వేదికగా వెల్లడించారు. అద్వానీ గొప్ప రాజనీతిజ్ఞుడని దేశాభివృద్ధిలో ఆయన పాత్ర కీలకమని కొనియాడారు. అద్వానీకి భారతరత్న ప్రదానం చేయడం తనకెంతో భావోద్వేగ క్షణమని పేర్కొన్నారు. ఆయనతో ఫోన్‌లో మాట్లాడి శుభాకాంక్షలు తెలిపినట్లు చెప్పారు.

కాగా ఇప్పటివరకూ 50 మంది ?ప్రముఖులు 'భారతరత్న'ను అందుకున్నారు. వీరిలో 17 మందికి మరణానంతరం భారతరత్న లభించింది. భారతరత్న పొందిన వారిలో క్రికెట్ గాడ్‌గా పేరొందిన సచిన్ టెండూల్కర్ పేరు కూడా ఉంది. భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మొదలుకొని మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ వరకు... ఇలా పలువురు 'భారతరత్న' పురస్కారం అందుకున్నారు. ఈ జాబితాలో ఇటీవల ప్రముఖ గాంధేయ సోషలిస్ట్ నేత, బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాకూర్ పేరు కూడా చేరింది.

**ఇప్పటివరకు 'భారతరత్న' అందుకున్నవారు**

1. చక్రవర్తి రాజగోపాలాచారి (రాజకీయవేత్త, రచయిత, న్యాయవాది, స్వాతంత్ర్య సమరయోధుడు)- 1954
2. సర్వేపల్లి రాధాకృష్ణన్ (తత్వవేత్త, రాజకీయవేత్త, భారత మాజీ రాష్ట్రపతి)- 1954
3. చంద్రశేఖర్ వెంకట రామన్ (భౌతిక శాస్త్రవేత్త)- 1954
4. భగవాన్ దాస్ (స్వాతంత్ర్య పోరాట యోధుడు, తత్వవేత్త, విద్యావేత్త)- 1955
5. మోక్షగుండం విశ్వేశ్వరయ్య (సివిల్ ఇంజనీర్, రాజకీయవేత్త, మైసూర్ దివాన్)- 1955
6. జవహర్‌లాల్ నెహ్రూ (స్వాతంత్ర్య సమర యోధుడు, రచయిత, భారత మాజీ ప్రధాని)- 1955
7. గోవింద్ వల్లభ్ పంత్ (స్వాతంత్ర్య సమరయోధుడు)- 1957
8. ధోండో కేశవ్ కర్వే (సంఘ సంస్కర్త, ఉపాధ్యాయుడు)- 1958
9. బిధాన్ చంద్ర రాయ్ (వైద్యుడు, రాజకీయ నేత , పరోపకారి, విద్యావేత్త, సామాజిక కార్యకర్త) - 1961
10. పురుషోత్తం దాస్ టాండన్ (స్వాతంత్ర్య సమర యోధుడు)- 1961
11. రాజేంద్ర ప్రసాద్ (స్వాతంత్ర్య సమర యోధుడు, న్యాయవాది, రాజకీయవేత్త, పండితుడు, భారత మాజీ రాష్ట్రపతి)- 1962
12. జాకీర్ హుస్సేన్ (స్వాతంత్ర్య పోరాట యోధుడు)- 1963
13. పాండురంగ్ వామన్ కేన్ (ఇండాలజిస్ట్, సంస్కృత పండితుడు)-1963
14. లాల్ బహదూర్ శాస్త్రి (మరణానంతరం) (స్వాతంత్ర్య సమర యోధుడు, భారత మాజీ ప్రధాని) %-- 1966
%15. ఇందిరా గాంధీ (రాజకీయనేత, భారత మాజీ ప్రధానమంత్రి)-1971
16. వరాహగిరి వెంకట గిరి (స్వాతంత్ర్య సమరయోధుడు, భారత మాజీ రాష్ట్రపతి)-1975
17. కుమారస్వామి కామరాజ్ (మరణానంతరం) (రాజకీయవేత్త, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి) - 1976
18. మదర్ మేరీ థెరిసా బోజాక్షియు (మదర్ థెరిసా) (మిషనరీస్ ఆఫ్ ఛారిటీ వ్యవస్థాపకురాలు) - 1980
19. వినోబా భావే (మరణానంతరం) (స్వాతంత్ర్య పోరాట యోధుడు, సంఘ సంస్కర్త)-1983
20. ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ (స్వాతంత్ర్య పోరాట యోధుడు)-1987
21. మరుదూర్ గోపాలన్ రామచంద్రన్ (మరణానంతరం) (రాజకీయనేతగా మారిన నటుడు)-1988
22. భీమ్ రావ్ రామ్‌జీ అంబేద్కర్ (మరణానంతరం) (సంఘ సంస్కర్త)-1990
23. నెల్సన్ రోలిహ్లాహ్లా మండేలా (వర్ణవివక్ష వ్యతిరేక పోరాట నేత)- 1990
24. రాజీవ్ గాంధీ (మరణానంతరం) (రాజకీయనేత, భారత మాజీ ప్రధాని)-1991
25. సర్దార్ వల్లభాయ్ పటేల్ (మరణానంతరం) (స్వాతంత్ర్య పోరాట యోధుడు)- 1991
26. మొరార్జీ రాంచోడ్జీ దేశాయ్ (స్వాతంత్ర్య పోరాట వీరుడు, భారత ప్రధాని)- 1991
27. మౌలానా అబుల్ కలాం ఆజాద్ (మరణానంతరం) (స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు)-1992
28. జహంగీర్ రతన్‌జీ దాదాభాయ్ టాటా (పారిశ్రామికవేత్త)- 1992
29. సత్యజిత్ రే (చిత్ర నిర్మాత)- 1992
30. గుల్జారీ లాల్ నందా (స్వాతంత్ర్య పోరాట యోధుడు)- 1997
31. అరుణా అసఫ్ అలీ (మరణానంతరం) (స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు)- 1997
32. ఎ.పి.జె. అబ్దుల్ కలాం ( శాస్త్రవేత్త, భారత మాజీ రాష్ట్రపతి)-1997
33. మదురై షణ్ముఖవడివు సుబ్బులక్ష్మి (కర్ణాటక శాస్త్రీయ గాయని)-1998
34. చిదంబరం సుబ్రమణ్యం (స్వాతంత్ర్య పోరాట యోధుడు)- 1998
35. జయప్రకాష్ నారాయణ్ (మరణానంతరం) (స్వాతంత్ర్య పోరాట యోధుడు, సంఘ సంస్కర్త)- 1999
36. అమర్త్య సేన్ (ఆర్థికవేత్త)- 1999
37. ప్రకాష్ గోపీనాథ్ బోర్డోలోయ్ (మరణానంతరం) (స్వాతంత్ర్య పోరాట యోధుడు) %-- 1999
38. రవిశంకర్ (సితార్ వాద్యకారుడు) - 1999
39. లతా దీనానాథ్ మంగేష్కర్ (గాయని)- 2001
40. ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ (హిందుస్తానీ క్లాసికల్ షెహనాయ్ ప్లేయర్)- 2001
41. భీంసేన్ గురురాజ్ జోషి (హిందుస్తానీ క్లాసికల్ సింగర్)- 2009

## అత్యంత రద్దీ నగరాల జాబితాలో ఆరోస్థానంలో బెంగళూరు..!



ప్రపంచంలోనే అత్యంత రద్దీ నగరాల జాబితాలో టెక్ సిటీ, స్టార్టప్‌లకు రాజధానిగా నిలిచిన బెంగళూరు నగరంలో ఆరో స్థానంలో నిలిచింది. డచ్ లొకేషన్ టెక్నాలజీ నిపుణుడు టామ్ టామ్ 2023 సంవత్సరం ఆధారంగా ఈ నివేదికను విడుదల చేశారు. 2022లో ప్రపంచంలోనే అత్యంత రద్దీగా ఉండే నగరాల్లో బెంగళూరు రెండో స్థానంలో నిలవడం గమనార్హం. గత ఏడాది బెంగళూరులో పది కిలోమీటర్ల దూరం ప్రయాణించేందుకు సగటున 29 నిమిషాలు పట్టింది. బెంగళూరులో ప్రస్తుతం 28 నిమిషాల 10 సెకన్ల సమయం పడుతున్నది. 2023లో బెంగళూరులో రద్దీ సమయాల్లో వాహనాల సగటు వేగం గంటకు 18 కిలోమీటర్లు. బెంగళూరు ప్రజలు ఏడాదిలో సుమారు 132 గంటల ట్రాఫిక్‌లో సమయం వృథా అయ్యింది. 2023 నాటికి ప్రపంచంలోనే అత్యంత రద్దీగా ఉండే నగరంగా లండన్ నిలిచిందని నివేదిక పేర్కొంది. లండన్‌లో సగటు వేగం గంటకు 14 కిలోమీటర్లు. లండన్‌తో పాటు పాటు ఐర్లాండ్‌లోని డబ్లిన్‌లో గంటకు 16 కిలోమీటర్లు. కెనడాలోని టొరంటో నగరంలో గంటకు 18 కిలోమీటర్లు. ఇటలీలోని మిలన్ నగరంలో గంటకు 17 కిలోమీటర్లు. పెరూలోని లిమాలో గంటకు 17 కిలోమీటర్లు. ఈ ఐదునగరాల అత్యంత రద్దీ నగరాల జాబితాలో టాప్-5లో నిలిచాయి. ఇదే జాబితాలో పుణే నగరం సైతం ప్రపంచవ్యాప్తంగా అత్యంత రద్దీగా, ట్రాఫిక్ అత్యధికంగా ఉండే నగరాల జాబితాలో ఏడో స్థానంలో నిలిచింది. పుణేలో పది కిలోమీటర్ల దూరం ప్రమాణం చేసేందుకు 27 నిమిషాల 50 సెకన్ల సమయం పడుతున్నది. ఇక్కడ వాహనాల సగటు వేగం గంటకు 19 కిలోమీటర్లు. పుణే తర్వాత బుకారెస్ట్, మనీలా, బ్రస్సెల్స్ నగరాలున్నాయి. రిపోర్ట్‌లో దేశ రాజధాని రాజధాని ఢిల్లీ అత్యంత రద్దీగా ఉండే నగరాల్లో 44వ స్థానంలో ఉన్నది. ఇక్కడ రద్దీ సమయంలో సగటు వేగం గంటకు 24 కిలోమీటర్లు. ఇదే జాబితాలో ఆర్థిక రాజధాని ముంబయి ప్రపంచవ్యాప్తంగా 54వ స్థానంలో నిలిచింది. గతేడాది సెప్టెంబర్ 27న బెంగళూరులో అత్యధిక ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఆ రోజు 10 కిలోమీటర్ల దూరం ప్రయాణించడానికి సగటున 32 నిమిషాలు పట్టింది. టామ్‌టామ్ ట్రాఫిక్ ఇండెక్స్ 55 దేశాల్లోని 387 నగరాలను కవర్ చేయగా.. దేశవ్యాప్తంగా ఇంధన ఖర్చులు, కర్బన ఉద్గారాలను సైతం అంచనా వేసింది.

## భారత్‌లో 9 లక్షల క్యాన్సర్ మరణాలు





**న్యూఢిల్లీ:** భారత్‌ను క్యాన్సర్ మహమ్మారి కబళిస్తున్న తీరును ప్రపంచ ఆరోగ్య సంస్థ తన తాజా గణాంకాల్లో వెల్లడించింది. ది ఇంటర్నేషనల్ ఏజెన్సీ ఫర్ రీసెర్చ్ ఆన్ క్యాన్సర్ గణాంకాల ప్రకారం 2022లో భారత్‌లో 14.1 లక్షల క్యాన్సర్ కేసులు నమోదయ్యాయి. క్యాన్సర్ కారణంగా 9.1 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. పురుషుల్లో పెదవులు, నోటి, ఊపిరితిత్తుల క్యాన్సర్లు సర్వసాధారణమయ్యాయి. రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లు మహిళల్లో ఎక్కువయ్యాయి. మొత్తం కొత్త కేసుల్లో 27 శాతం బ్రెస్ట్, 18 శాతం సెర్విక్స్ యుటెరీ క్యాన్సర్లు ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ సోకి ఐదేళ్లుగా బాధపడుతున్న వారి సంఖ్య 5.3 కోట్లకు చేరిందని నివేదికలో పేర్కొన్నారు.

## పట్నాలో మెట్రో పరుగులు.. ఎప్పుడంటే..



బీహార్ రాజధాని పట్నాలో 'మెట్రో' పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. 2027 నాటికి ఈ పనులు పూర్తవుతాయనే అంచనాలున్నాయి. మొదటి దశలో మొత్తం 26 మెట్రో స్టేషన్లను నిర్మిస్తున్నారు. వీటిలో 13 భూగర్భ, 13 ఎలివేటెడ్ మెట్రో స్టేషన్లు. ఫేజ్-1 కింద రెండు కారిడార్లను నిర్మిస్తున్నారు. మొదటి కారిడార్ దానాపూర్ నుండి ఖేమిన్‌చాక్ వరకు వెళుతుంది. దీని పొడవు 18 కిలోమీటర్లు ఉంటుంది. రెండవ కారిడార్ పట్నా జంక్షన్ నుండి పాటలీపుత్ర బస్ టెర్మినల్ వరకు ఉంటుంది. రెండో కారిడార్ పొడవు 14 కిలోమీటర్లు. మీడియాకు అందిన వివరాల ప్రకారం కారిడార్-1లో మొత్తం 14 మెట్రో స్టేషన్లు ఉంటాయి. వాటిలో 8 ఎలివేటెడ్, ఆరు భూగర్భ మెట్రో స్టేషన్లు. రెండో కారిడార్‌లో మొత్తం 12 మెట్రో స్టేషన్లు నిర్మించనున్నారు. వీటిలో ఐదు ఎలివేటెడ్, ఆరు భూగర్భంలో ఉంటాయి. డీఆర్ఎంసీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం కారిడార్-2 జనవరి 2027 నాటికి ప్రారంభంకానుంది. ప్రస్తుతం భూగర్భ సొరంగాలు సిద్ధమవుతున్నాయి. దాదాపు 1.2 కిలోమీటర్ల మేర తవ్వకాలు పూర్తయ్యాయి. కాగా ఢిల్లీ-నోయిడా మధ్య కనెక్టివిటీని పెంచేందుకు నోయిడాలో కొత్త మెట్రో మార్గాలను నిర్మించాలని అధికారులు గతంలో నిర్ణయించారు. గత ఏడాది నూతన మెట్రో మార్గానికి సంబంధించిన వివరణాత్మక ప్రాజెక్ట్ నివేదికను ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ రూపొందించింది. నోయిడా మెట్రో రైల్ కార్పొరేషన్ దీనికి ఆమోదం తెలిపింది.

## ప్రముఖ బ్యాంకును అమ్మనున్న కేంద్రం..!




కేంద్రం కొన్ని ప్రభుత్వసంస్థల నుంచి చాలా కాలంగా పెట్టుబడులను ఉపసంహరిస్తోంది. వ్యూహాత్మక విక్రయాల్లో భాగంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంటోందని పలుమార్లు చెప్పింది. తాజాగా ప్రముఖ బ్యాంకులోని ప్రభుత్వ వాటాను విక్రయించేందుకు సన్నద్ధం జరుగుతోంది. ఈ ఆర్థిక సంవత్సరం 2024-25లో ఐడీబీఐ బ్యాంక్‌లోని తమ వాటాను ఉపసంహరించుకుంటామని పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ శాఖ (దీపం) కార్యదర్శి తుహిన్ కాంత పాండే అన్నారు. పీటీఐ టీవీకి తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో పాండే మాట్లాడారు. ఐడీబీఐ బ్యాంక్ ప్రైవేటీకరణ ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. ఈ క్రమంలోనే రాబోయే ఆర్థిక సంవత్సరంలో ఐడీబీఐ వ్యూహాత్మక విక్రయం పూర్తవుతుందన్న ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నుంచి భద్రతాపరమైన అనుమతి, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నుంచి వ్యవస్థీకృత ఆమోదం లభిస్తే.. బ్యాంక్‌ను కొనేందుకు ఆసక్తి ఉన్నవారిని బిడ్ల ద్వారా ఆహ్వానిస్తామని తెలిపారు. ప్రస్తుతం ఐడీబీఐ బ్యాంక్‌లో పరోక్షంగా, ప్రత్యక్షంగా కేంద్ర ప్రభుత్వానికి సుమారు 95 శాతం వాటా ఉంది. కేంద్ర ప్రభుత్వానికి 45 శాతం వాటా ఉండగా, ప్రభుత్వ రంగ బీమా సంస్థ అయిన లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ)కు 49.24 శాతం వాటా ఉంది. ఈ రెండు వాటాల్లో కలిపి మొత్తంగా దాదాపు 61 శాతం అమ్మేయాలని కేంద్రం యోచిస్తోంది. ఇక 2022 అక్టోబర్‌లోనే బిడ్లను ఆహ్వానించగా, 2023 జనవరిలో కొంటామని కొందరు ఆసక్తికనబరిచినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. కాగా, వచ్చే నెలాఖర్లోగా ఖజానాకు రూ.17,500 కోట్ల నిధులు అవసరం కానున్నాయి. సవరించిన అంచనాల ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ (సీపీఎస్ఈ)ల్లో పెట్టుబడుల ఉపసంహరణ, ఆస్తుల నగదీకరణతో రూ.30,000 కోట్లను ఖజానాకు తరలించాల్సి ఉంది. ఇదిలా ఉండగా, ఐడీబీఐ బ్యాంకులో వాటా కొనుగోలు చేయాలనుకునే బిడ్డర్లకు కనీసం రూ.22,500 కోట్ల కనీస నికర సంపద, గత ఐదేళ్లలో కనీసం మూడేళ్లలో నికర లాభాలు ఉండాలనే నియమాలు ఉన్నాయి. ఒకవేళ బిడ్డర్లు కన్సార్టియంగా ఏర్పడితే.. గరిష్ఠంగా నలుగురు మాత్రమే ఉండాలని 'దీపం' షరతు విధించింది. డీల్ కుదిరితే బిడ్డర్లు కనీసం 40 శాతం వాటాలను ఐదేళ్ల వరకు తమ వద్దే అట్టిపెట్టుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేసింది.

# ఒక్క ఛాన్స్ ప్లీజ్!

-మొదటి పేజీ తరువాయి

బదిలీ కావడంతో.. వాళ్ల స్థానాల్లో పోటీకి బంధువులు, సన్నిహితులు ఆసక్తి చూపిస్తున్నారు. భువనగిరి ఎంపీ సీటు కోసం కోమటిరెడ్డి బంధువులు గట్టిగానే ప్రయత్నాలు చేస్తున్నారు. కోమటిరెడ్డి అన్న కొడుకు పవన్, బంధువు చల్లూరి మురళీధర్ అప్లికేషన్లు సమర్పించారు. రేవంత్ సీఎం కావడంతో ఖాళీ అయిన మల్కాజ్‌గిరి ఎంపీ సీటు కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో మాజీ కేంద్ర మంత్రి సర్వే సత్యనారాయణతో పాటు ప్రముఖ సినీ నిర్మాత బండ్ల గణేశ్ కూడా ఉన్నారు. అలాగే.. రేవంత్ సన్నిహితుడు పటేల్ రమేష్ రెడ్డి, చామలచకిరణ్‌లు సైతం దరఖాస్తులు సమర్పించారు.
ఇక నల్గొండ సీటు కోసం జానారెడ్డి కొడుకు రఘువీర్ దరఖాస్తు ఇచ్చారు. మహబూబాబాద్ సీటు కోసం తెలుగు వర్సిటీ రిజిస్ట్రార్ రమేష్ భట్టు అప్లికేషన్ సమర్పించడం గమనార్హం. దరఖాస్తులు ఇచ్చినవాళ్లలో.. మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్, ఆయన కుమార్తె చంద్రప్రియ (నాగర్‌కర్నూల్), ఎంఆర్‌జీ వినోద్‌రెడ్డి, విద్యా స్రవంతి (సికింద్రాబాద్) పెరిక శ్యామ్ (పెద్దపల్లి) తదితరులున్నారు. కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ మల్కాజ్‌గిరితో పాటు ఎస్సీ రిజర్వుడు నియోజక వర్గాలైన వరంగల్, పెద్దపల్లి, నాగర్‌కర్నూల్ కోసం మొత్తంగా నాలుగు దరఖాస్తులు అందజేశారు.

**హాట్ సీటు ఏదంటే..**

తెలంగాణలో కాంగ్రెస్ తరఫున హాట్‌సీట్‌గా మారింది ఖమ్మం లోక్‌సభ స్థానం. రేణుకా చౌదరి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని, పలువురు దరఖాస్తులు ఇచ్చారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సోదరుడు ప్రసాద్ రెడ్డి, మాజీ కేంద్రమంత్రి రేణుకా చౌదరి, వీ హనుమంతరావులు సైతం అప్లికేషన్లు ఇచ్చారు. తెలంగాణ మాజీ హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు, ప్రముఖ వ్యాపారవేత్త, వీవీసీ గ్రూపు సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వంకాయల పాటి రాజేంద్రప్రసాద్‌లు సైతం దరఖాస్తు చేసుకున్నారు.

**హాట్ టాపిక్‌గా గడల**

ఖమ్మంతో పాటు సికింద్రాబాద్ ఎంపీ స్థానానికి కూడా గడల శ్రీనివాస్ దరఖాస్తు చేశారు. గతంలో హెల్త్ డైరెక్టర్‌గా ఉండి.. అప్పటి సీఎం కేసీఆర్ కాళ్లు మొక్కి వార్తల్లోకెక్కిన గడల.. కొత్తగూడెం అసెంబ్లీ టికెట్ ఆశించారు. కానీ కేసీఆర్ టికెట్ ఇవ్వలేదు. రేవంత్ సర్కార్ కొలువుదీరిన వెంటనే గడలను ఆ



పోస్టు నుంచి బదిలీ చేసినా.. లాంగ్‌లీవ్‌లో ఉండి మరీ ఆయన సన్నిహితుల ద్వారా గాంధీభవన్‌కు దరఖాస్తు పంపించడం గమనార్హం.

**ఖమ్మం పార్లమెంట్ స్థానానికి తీవ్రమైన పోటీ**

మరోవైపు.. ఖమ్మం కాంగ్రెస్‌లో ఆసక్తికర పరిణామాలో చోటుచేసుకుంటున్నాయి. ఖమ్మం పార్లమెంట్ స్థానానికి తీవ్రమైన పోటీ నెలకొంది. మాజీ సీనియర్లు, కీలక నేతల కుటుంబ సభ్యులు ఎంపీ టికెట్ ఆశిస్తున్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సోదరుడు పొంగులేటి ప్రసాద్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు తుమ్మల యుగేందర్, మాజీ కేంద్రమంత్రి రేణుక చౌదరి టికెట్ రేసులో ఉన్నారు.
కాగా, ఈరోజు ఖమ్మంలోని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క క్యాంప్ ఆఫీస్ నుంచి 500 కార్లతో భారీ ర్యాలీగా ఎంపీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి మల్లు నందిని వెళ్లనున్నారు. మల్లు నందినికే టికెట్ ఇవ్వాలని విక్రమార్క్ అనుచరులు, కాంగ్రెస్ కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు. ఇక, ఖమ్మం ఎంపీ స్థానంలో సోనియా గాంధీ పోటీ చేయకపోతే.. అక్కడ తాను పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు మాజీ కేంద్రమంత్రి రేణుక చౌదరి ప్రకటించారు. దీంతో, ఖమ్మం అభ్యర్థి ఎవరు అనే దానిపై సస్పెన్స్ నెలకొంది.

**ఖమ్మం రేసులో డిప్యూటీ సీఎం భార్య.. ఎంపీ టికెట్‌కు దరఖాస్తు**

ఖమ్మం ఎంపీ టికెట్ కోసం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క భార్య నందిని దరఖాస్తు చేసుకున్నారు. అనంతరం ఆమె గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఖమ్మం నుంచి సోనియాగాంధీ, ప్రియాంకను పోటీ చేయాలని కోరామన్నారు. ఇద్దరిలో ఎవరు పోటీ చేసినా భారీ మెజార్టీతో గెలిపిస్తామని.. వారు పోటీ చేయకుంటే తనకు అవకాశం ఇవ్వాలని అధిష్ఠానాన్ని కోరినట్లు ఆమె తెలిపారు. దాదాపు 20 ఏళ్లుగా ఖమ్మం ప్రజలతో కలిసి పనిచేస్తున్నామని, వారి ఒత్తిడి మేరకే ఎంపీగా పోటీ చేయాలని నిర్ణయించుకున్నట్టు చెప్పారు. కాంగ్రెస్ అధిష్టానం ఏ నిర్ణయం తీసుకున్న కట్టుబడి ఉంటామని, తెలంగాణలో అన్ని సీట్లు కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని ఆమె ధీమా వ్యక్త చేశారు. దేశంలో రాహుల్ ప్రధాని కావడం ఖాయమని నందిని అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు వివిధ పార్టీల నుంచి పలువురు నేతలు ఆసక్తి చూపిస్తున్నారు. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ తెలంగాణలోని పలు లోక్ సభ స్థానాల నుంచి పోటీ చేయాలనుకునే ఆశావహుల నుంచి దరఖాస్తులను స్వీకరించింది.

## ముందు లిక్కర్ కేసు నుంచి బయటపడు... ఈ కేసు వల్ల నీ తల్లి ఎంత బాధపడ్డారో!: కవితపై బండ్ల గణేశ్ ఆగ్రహం

**రేవంత్ రెడ్డిపై విమర్శలు తర్వాత కానీ, ముందు లిక్కర్ కేసు నుంచి బయటపడాలని కవితకు సూచన**

**ఇన్నాళ్లు గుర్తుకు రాని పూలే ఈ రోజు గుర్తుకు రావడం విడ్డూరంగా ఉందని వ్యాఖ్య**

**కాంగ్రెస్ పాలనను అందరూ మెచ్చుకుంటోంటే మీకు నచ్చడం లేదని ఆగ్రహం**

**ఆడబిడ్డవి... నీపై లిక్కర్ కేసు వస్తే నీ తల్లిదండ్రులకు అవమానం కాదా? అని వ్యాఖ్య**



'ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై విమర్శలు తర్వాత కానీ ముందు మీరు లిక్కర్ కేసు నుంచి బయటపడండి... రెస్ట్ తీసుకోండి... ఏం తప్పు చేశారో తెలుసుకోండి... ప్రెస్ మీట్లు బంద్ చేయండి... అసహ్యించుకుంటున్నారు' అంటూ సినీ నిర్మాత బండ్ల గణేశ్ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఓ వీడియోను విడుదల చేశారు. కవితను నేను ఓ ప్రశ్న అడుగుతానని... తప్పుగా అనుకోవద్దన్నారు. ఇన్నాళ్లుగా గుర్తుకు రాని పూలే ఈ రోజు గుర్తుకు రావడం విడ్డూరంగా ఉందన్నారు. గత పదేళ్ల బీసీల గురించి మాట్లాడని మీరు ఈ రోజు మాట్లాడటం ఆనందంగా ఉందని ఎద్దేవా చేశారు. కానీ రేవంత్ రెడ్డి పరిపాలనను... కాంగ్రెస్ పరిపాలనను తెలంగాణ ప్రజలంతా మెచ్చుకుంటుంటే మీకు నచ్చడం లేదని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఇచ్చిందే కాంగ్రెస్ అని... ఆ పార్టీని విమర్శించవద్దని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి ప్రజల్లోకి వెళితే మీకు ఇష్టం ఉండదని... గేటు బయటే ఆపేసి బతికున్న గద్దర్‌ను చంపేశారని ఆరోపించారు. ఆయన పేరుపై కాంగ్రెస్ పార్టీ అవార్డులు తెస్తోందన్నారు. జానారెడ్డి తను తప్పుకున్న తర్వాతే కొడుకుకి అవకాశమిచ్చారని గుర్తు చేశారు. మంత్రులను డమ్మీ చేసింది మీరు కాదా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. లిక్కర్ కేసులో అక్రమ సంపాదనకు పాల్పడలేదా? అని నిలదీశారు. లిక్కర్ కేసుతో రాష్ట్రాన్ని అపఖ్యాతిపాలు చేసింది మీరు కాదా? అని విమర్శించారు. ఎంపీగా ఓడిపోతే మీరు ఏడ్చి... ఎమ్మెల్సీ తెచ్చుకున్నారని ఎద్దేవా చేశారు. పార్టీ ఆఫీస్ కోసం స్థలం ఇచ్చిన కొండా లక్ష్మణ్ బాపూజీని కూడా మీరు పట్టించుకోలేదని ఆరోపించారు. మీరు... కేటీఆర్ సీఎం కావాలని ఆశపడ్డారు... అది నెరవేరకపోవడంతో రేవంత్ రెడ్డిపై విమర్శలు చేస్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందు కవిత లిక్కర్ కేసు నుంచి బయటపడాలన్నారు. ఆడబిడ్డవి... నీపై లిక్కర్ స్కాం కేసు రావడం నీ తల్లిదండ్రులకి అవమానమని వ్యాఖ్యానించారు. దీని వల్ల నీ తల్లి ఎంత క్షోభపడి ఉంటుందో ఆలోచించాలన్నారు. ఇలాంటి బిడ్డను ఎందుకు కన్నానని ఆ మహాతల్లి ఎంత బాధపడిందో అన్నారు. కాంగ్రెస్ పార్టీని కుటుంబ పార్టీ అనడం విడ్డూరంగా ఉందన్నారు. బీఆర్ఎస్ 'రావు'ల పార్టీగా ఉండటంలో తప్పులేదా? అన్నారు. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రాన్ని దోచుకున్నారని... రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని మండిపడ్డారు. తెలంగాణపై 7 లక్షల కోట్ల రూపాయల అప్పు పెట్టారని మండిపడ్డారు. అన్ని శాఖలను అప్పుల్లో ముంచారన్నారు.

## పబ్బుల్లో డ్రగ్స్.. యువతులు అరెస్ట్



**హైదరాబాద్:** పబ్బుల్లో డ్రగ్స్ అమ్ముతున్న ఆరుగురు సభ్యుల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. మాదాపూర్, గచ్చిబౌలి, జూబ్లీహిల్స్‌లోని పబ్‌ల్లో డ్రగ్ విక్రయాలు చేస్తున్నారు. మాదాపూర్‌లోని నోవాటెల్ ఆర్టిస్ట్రీ, ఎయిర్ లైవ్, క్లబ్ రౌగ్, క్లబ్ రాక్ పబ్బుల్లో డ్రగ్స్ దందా సాగిస్తున్నారు. బెంగళూరు, ముంబై, గోవా నుంచి డ్రగ్స్ తెచ్చి పబ్బుల్లో విక్రయిస్తున్న మహిళల నుంచి 10 గ్రాముల ఎండీఎంఏతో పాటు కొకైన్ స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ అమ్ముతున్న మిథున, కొంగాల ప్రియలను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరితో పాటు మరో నలుగురు కలిసి గత కొంతకాలం నుంచి డ్రగ్స్ అమ్ముతున్నట్లు పోలీసులు గుర్తించారు. వీరంతా బెంగళూరు, ముంబై, గోవా నుంచి డ్రగ్స్ తీసుకొచ్చి అమ్ముతున్నట్లు గుర్తించారు. డ్రగ్స్ సప్లయర్స్ ఉస్మాన్, అజీం, అబ్దుల్లా పరారీలో ఉన్నారు.

## ప్రతీ కనెక్షన్‌కు మొబైల్ నెంబర్ ఇవ్వాలన్న తెలంగాణ విద్యుత్ శాఖ

**బిల్లులు, ఇతర వివరాలను మెసేజ్ చేస్తామని వెల్లడి**

**ఇప్పటికీ కొంతమంది వినియోగదారుల నెంబర్లు లేవని వివరణ**

**విద్యుత్ రెవెన్యూ ఆఫీసులో నెంబర్ ఇవ్వాలని సూచన**



విద్యుత్ కనెక్షన్ ఉన్న ప్రతీ వినియోగదారుడు తమ మొబైల్ నెంబర్ ను అందించాలని తెలంగాణ విద్యుత్ అధికారులు విజ్ఞప్తి చేశారు. విద్యుత్ రెవెన్యూ ఆఫీసులో తమ కనెక్షన్ కు సంబంధించిన వివరాలలో ఫోన్ నెంబర్ ను అప్ డేట్ చేసుకోవాలని సూచిస్తున్నారు. బిల్లులు సహా ఇతరత్రా సమాచారం ఎప్పటికప్పుడు చేరవేసేందుకు ఇది ఉపయోగపడుతుందని వివరించారు. దీనివల్ల బిల్లుల వివరాలను ఫోన్ కు మెసేజ్ చేస్తామని, ఎప్పటికప్పుడు వివరాలు తెలుసుకోవడం సులభంగా మారుతుందని చెప్పారు. విద్యుత్ పంపిణీ సంస్థ నుంచి మెసేజ్ లు అందుకునే వీలుంటుందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు కొంతమంది వినియోగదారుల నెంబర్లు అప్ డేట్ కాకపోవడంతో వారికి మెసేజ్ లు వెళ్లడంలేదని అధికారులు వివరించారు.

# తెలంగాణాలోనూ.. ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్

-మొదటి పేజీ తరువాయి



కూడా ఎన్నికలకు ముందు ఓటాన్ అకౌంట్‌ను, ఎలక్షన్ల తర్వాత పూర్తి స్థాయి బడ్జెట్‌ను శాసనసభకు సమర్పించనుంది. లోక్‌సభ ఎన్నికల కోడ్ ఫిబ్రవరిలో రానుంది. ఈ క్రమంలో పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టటం సాధ్యం కాదు. అయితే వివిధ శాఖల నుంచి ప్రతిపాదనలను పూర్తి స్థాయిలో తీసుకుని, అందుకనుగుణంగానే పద్దును రూపొంది స్తున్నారు. కానీ ఎన్నికల నేపథ్యంలో జీతాలు, భత్యాలు, ఇతరత్రా నిర్వహణ ఖర్చులను ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ వరకు కోసం ఓటాన్ అకౌంట్‌ను ప్రవేశపెట్టి, శాసనసభ అనుమతి తీసుకోనున్నారు. ఎన్నికల తర్వాత మరోసారి అన్ని శాఖల పద్దులను క్రోడీకరించి పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రతిపాదిస్తారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ప్రస్తుతానికి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్య శ్రీ పరిధి రూ.10 లక్షలకు పెంపు అమలవుతున్న సంగతి తెలిసిందే. మిగతా గ్యారెంటీల అమలు ఎన్నికల తర్వాతే ఉంటుందంటూ ఉన్నతాధికారులు చెబుతున్నారు. వాటిని అమలు చేయాలంటే నిధులు సమకూర్చుకోవాలి, నియమ నిబంధనలు, మార్గదర్శకాలు రూపొందించాల్సి ఉంటుంది. ఆ తర్వాత అధికార యంత్రాంగమంతా క్షేత్రస్థాయిలోకి దిగి, లబ్దిదారులను ఎంపిక చేయాలి. ఇప్పటికే ప్రజా పాలన పేరిట దరఖాస్తులను స్వీకరించినప్పటికీ వాటి పరిశీలనకు మరింత సమయం పట్టే అవకాశముంది. అందువల్ల మిగతా గ్యారెంటీలన్నీ అమలు కావాలంటే లోక్‌సభ ఎన్నికలు అయ్యేంత వరకూ వేచి చూడక తప్పదని అధికారిక వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రతిపక్ష బీఆర్ఎస్ ఇప్పటికే ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని పట్టుబడుతోంది. లోక్‌సభ ఎన్నికల కోడ్, ఓటాన్ అకౌంట్ పేరిట హామీలను విస్మరించకూడదంటూ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో ఆరు గ్యారెంటీలను కచ్చితంగా అమలు చేసి తీరతామంటూ చెబుతున్న ప్రభుత్వం? అందుకోసం ఎలాంటి వ్యూహాన్ని అమలు చేయబోతున్నదో చూడాలి. ఆర్థిక వేత్తలు, నిపుణులు మాత్రం?'కాంగ్రెస్ ఇచ్చిన హామీలు, ఆరు గ్యారెంటీలు' అనేవి అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించినవి కాబట్టి, అవి 'ఆన్ గోయింగ్' పరిధిలోకి వస్తాయి?' అని చెబుతున్నారు. అందువల్ల ఆయా పథకాలకు నిధులు కేటాయిస్తే, వాటిని అమలు చేయ టానికి ఎలాంటి ఇబ్బందులూ ఉండబోవని అభిప్రాయ పడుతున్నారు.

## గృహ నిర్మాణ సంస్థ ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తా



-మొదటి పేజీ తరువాయి

ఆందోళన చెందవద్దని అని అన్నారు. ఈ సమావేశంలో హౌసింగ్ చీఫ్ ఇంజినీర్ ఈశ్వరయ్య, సంఘం అధ్యక్షుడు గవ్వ రవీందర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ బొగ్గుల వెంకట రామిరెడ్డి, కార్యదర్శి రఘువీర్ ప్రసాద్ గుప్తా, జనరల్ మేనేజర్లు చైతన్య తదితరులు పాల్గొన్నారు.

**పొంగులేటితో కేరళ మంత్రి భేటి**

కేరళ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి కె.రాజన్ కేరళ రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూ శాఖ కార్యదర్శి సాంబశివరావ్, శనివారం తెలంగాణ మంత్రి పొంగులేటితో సచివాలయంలో మర్యాదపూర్వకంగా భేటి అయ్యారు. ఈ సందర్భంగా కేరళ రాష్ట్రంలో అమలవుతున్న హౌసింగ్ స్కీమ్‌తో పాటు రెవెన్యూ విభాగం పనితీరు, వాటి వివరాలను పొంగులేటి అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ భూముల పరిరక్షణతో పాటూ అభివృద్ధి సంక్షేమ పథకాలకు అర్హులైన లబ్ధిదారులను గుర్తించడంలో రాష్ట్ర రెవెన్యూ యంత్రాంగం పాత్ర కీలకమైనదని పేర్కొన్నారు. రెవెన్యూ శాఖ సమర్థవంతంగా పనిచేసినప్పుడే ప్రజలకు ప్రభుత్వం నిర్ధేశించిన లక్ష్యాలు, అకాంక్షలు నెరవేరి ప్రభుత్వం కోరుకున్న ఫలితాలు లభిస్తాయన మంత్రి అభిప్రాయపడ్డారు.

## గ్రామాల అభివృద్ధితోనే ప్రజల జీవితాల్లో మార్పులు

-మొదటి పేజీ తరువాయి

సమావేశంలో దామోదర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆడపిల్లలకు చదువు ఆయుధమన్నారు. చదువుతో సంస్కారం అలవడుతుందన్నారు.
మంచి నడవడి, మంచి ఆలోచనలు చదువు ముఖ్యమన్నారు. చదువుకొని సమాజంలో బాధ్యతగా ఉండాలన్నారు. ప్రశ్నించడం అనేది చదువుతో వస్తుందన్నారు. మాతృభాషలో ప్రేమతో ఉండాలన్నారు. ఇతర భాషలను గౌరవించాలని, సబ్జెక్టులపై పట్టు సాధించాలన్నారు. కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో మౌలిక సదుపాయాల కోసం రూ.85లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ వేంకటేశ్వర్లు, డీఈఓ రాధా కిషన్, మెదక్ ఆర్డీఓ అంబాదాస్ రాజేశ్వర్ పాల్గొన్నారు.

# అవార్డులను అమ్ముకున్న చరిత్ర కాంగ్రెస్ పార్టీది

**కాంగ్రెస్‌పై దేశద్రోహం కేసు పెట్టాలి**

**దేశాన్ని విభజించాలి అంటూ కాంగ్రెస్ ఎంపీ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాను**

**టెర్రరిస్టులు, ఉగ్రవాదులు చేసిన వ్యాఖ్యలకు కాంగ్రెస్ నేతలు సపోర్టు చేస్తున్నారు.**

**కరీంనగర్:** బీజేపీ సీనియర్ నాయకుడు ఎల్‌కే అద్వానీకి భారతరత్న ఇవ్వడంపై ఎంపీ బండి సంజయ్ హర్షం వ్యక్తం చేశారు. అద్వానీకి భారతరత్న ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఇదే సమయంలో కాంగ్రెస్ పార్టీపై దేశద్రోహం పెట్టాలని డిమాండ్ చేశారు. కాగా, బండి సంజయ్ తాజాగా మీడియాతో మాట్లాడుతూ..'దేశంలో ఎమర్జెన్సీ, అయోధ్య పోరాటంలో పాల్గొన్న అద్వానీకి భారతరత్న ఇవ్వడం సంతోషంగా ఉంది. అన్ని సర్వేల్లో బీజేపీ, ప్రధాని మోదీనే మళ్లీ గెలుస్తారు అని రిపోర్టులు రావడం చూసి బీఆర్ఎస్ నాయకులు కంగారు పడుతున్నారు. బీఆర్ఎస్ ఎంపీ ఎన్నికల కోసం చేసిన సర్వే రిపోర్టు నా దగ్గరకి వచ్చింది. కాంగ్రెస్‌పై దేశద్రోహం కేసు పెట్టాలి. దేశాన్ని విభజించాలి అంటూ కాంగ్రెస్ ఎంపీ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాను. టెర్రరిస్టులు, ఉగ్రవాదులు చేసిన వ్యాఖ్యలకు కాంగ్రెస్ నేతలు సపోర్టు చేస్తున్నారు. ఇండియా కూటమి విచ్చినం అవుతుందన్న ఆందోళనతో వారు ఇలాంటి పిచ్చి కామెంట్స్ చేస్తున్నారు. రాజీవ్ గాంధీ కూడా ఇలా మాట్లాడిన చరిత్ర ఉంది. అవార్డులను అమ్ముకున్న చరిత్ర కాంగ్రెస్ పార్టీది. కాంగ్రెస్ హయాంలో పద్మభూషణ్, పద్మశ్రీ అవార్డులు కావాలంటే డబ్బులు ఇస్తే వచ్చేవి. కానీ, సమాజంలో నిజమైన అర్హులకు మాత్రమే బీజేపీ



అవార్డులను ఇస్తోంది' అంటూ కామెంట్స్ చేశారు.

# స్థానిక వార్తలు

## కార్యకర్తలకు బీఆర్ఎస్ అండగా ఉంటుంది: బాణోత్ మదన్ లాల్

**వాస్తవ నేస్తం, వైరా:** బిఆర్ఎస్ పార్టీ ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని బీఆర్ యస్ వైరా నియోజకవర్గ ఇన్చార్జ్ ,వైరా మాజీ శాసనసభ్యులు బాణోత్ మదన్ లాల్ అన్నారు .శనివారం వైరా మున్సిపాలిటీలో 1,13 వార్డు లో బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వం ఉండి ఇటీవల మరణించిన వారి కుటుంబాలకు సంబంధించి పార్టీ ఇన్సూరెన్స్ చెక్కులను బాణోత్ మదన్ లాల్ అందజేశారు. ఇంటికి వెళ్ళి నేరుగా వారికి మదన్ లాల్ చెక్కులు అందజేశారు. అనంతరం బాణోత్ మదన్ లాల్ మాట్లాడుతూ ప్రతి కార్యకర్త పార్టీ అభివృద్ధి ధ్యేయంగా పనిచేయాలని ఎలాంటి ఆందోళన గురి కావద్దని ప్రతి ఒక్క బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తకు, కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని ,నాతో పాటు రాష్ట్ర పార్టీ కూడా మీకు నిత్యం అండగా ఉంటుందని ఆయన అన్నారు. రానున్న రోజుల్లో పార్టీ అభివృద్ధి ధ్యేయంగా ప్రతి ఒక్కరు పనిచేసి ముందుకు సాగాలని, ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాటం చేసి వాటిని అమలు చేసే విధంగా ముందుకు పోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు



మద్దెల రవి, వార్డు కౌన్సిలర్ మరికంటి డేడి కుమారి శివ,లయన్ పాస్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళి కృష్ణ రామాలయం చైర్మన్ మిట్టపల్లి సత్యం బాబు, మరికంటి శివ, కొత్త వెంకటేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న కోవ దౌలత్ రావు మొకాశి



**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** ఆదివాసి సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కోవ దౌలత్ రావు మొకాశి కాంగ్రెస్ పార్టీ నుండి ఆదిలాబాద్ ఎంపీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. శనివారం గాంధీభవన్ లో దరఖాస్తును సమర్పించి తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని కోరారు. ఆదిలాబాద్ పార్లమెంటు టికెట్ తనకు కేటాయిస్తే అత్యధిక మెజారిటీతో విజయం సాధిస్తానని ధీమా వ్యక్తంచేశారు. తనకు ఆదివాసీ ఉద్యమ సంఘాల మద్దతు, ప్రజా సంఘాల మద్దతు, ఉద్యోగ సంఘాల మద్దతు ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటీ, గుడిహత్నూర్ మండల అధ్యక్షులు మల్యాల కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

## కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం



**వాస్తవ నేస్తం,వైరా:** చింతకాని మండలం నేరేడు గ్రామంలో వైరా లయన్స్ కంటి ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 100 మందికి పరీక్షల నిర్వహించి 15 మందికి కంటి ఆపరేషన్ అవసరమని గుర్తించారు. నేరడ గ్రామ ప్రజలందరూ పేదలకు, వృద్దులకు ఉచిత వైద్యం అందిస్తున్న వైరా కంటి ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ కు వారు ప్రత్యేక దన్యవాదములు తెలిపారు. ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయటం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నేరేడు గ్రామ సర్పంచ్ గోరుము ఈశ్వరమ్మ, పంచాయతీ సెక్రటరీ మురళి, డాక్టర్ రవిచంద్ర, కంటి ఆస్పత్రి నిర్వాహకులు లయన్ ఉంద్రు శామ్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

## బాధిత కుటుంబ సభ్యులకు ఇన్సూరెన్స్ చెక్కుల అందజేత



**వాస్తవ నేస్తం,వైరా:** మున్సిపాలిటీ పరిధిలోని ఒకటవ వార్డుకు చెందిన వరపర్ల ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులకు బిఆర్ఎస్ పార్టీ తరపున రూ.2 లక్షల ఇన్సూరెన్స్ చెక్కును వారి కుటుంబ సభ్యులకు బిఆర్ఎస్ వైరా నియోజకవర్గ ఇన్చార్జ్ బానోత్ మదనలాల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ మరికంటి డేడి కుమారి, పట్టణ బిఆర్ఎస్ అధ్యక్షులు మద్దెల రవి, దిశా కమిటీ మెంబర్ కట్టాకృష్ణర్జున్ రావు, ప్రముఖ వైద్యులు డాక్టర్ కాప మురళీకృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ ముల్లపాటి సీతారాములు, రామాలయం చైర్మన్ మిట్టపల్లి సత్యంబాబు, మాదినేని ప్రసాద్, ఏదునూరు శీను, చింతపల్లి బుజ్జి, చర్లపల్లి రవీందర్, మరికంటి శివ, తదితరులు పాల్గొన్నారు.

## వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలి ఎస్సై మచ్చేందర్ రెడ్డి

**వాస్తవ నేస్తం,ఏర్గట్ల:** రోడ్డు భద్రత వారోత్సవాల భాగంగా భీంగల్ సీఐ శ్రీనివాస్, ఏర్గట్ల ఎస్సై మచ్చేందర్ రెడ్డి పోలీస్ సిబ్బందితో కలిసి హెల్మెట్లు ధరించిన వాహనదారులకు పుష్పగుచ్చాలు అందజేసి శాలువాలతో శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వాహనదారులకు ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కల్పించారు. వాహనదారులందరూ తప్పకుండా ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## గ్రామపంచాయతీ పాలకవర్గానికి ఘన సన్మానం

**వాస్తవ నేస్తం, అనంతగిరి:** గ్రామపంచాయతీ లలో కొలువుతీరిన పాలకవర్గం పదవీకాలం జనవరి 31తో ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. కాగా గత ఐదు సంవత్సరాలుగా గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామాల్లో సేవలు అందించిన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో గ్రామపంచాయతీ కార్యదర్శులు సన్మాన కార్యక్రమాలు చేపట్టారు. ఈ క్రమంలోనే అమీనాబాద్ గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యుల పదవీ విరమణ సభను శనివారం గ్రామ పంచాయితీ సిబ్బంది ఘనంగా నిర్వహించినారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ స్వర్ణ నంది అవార్డు గ్రహీత, ముత్తినేని కోటేశ్వరరావు మాట్లాడుతూ.. ఐదు సంవత్సరాలుగా గ్రామపంచాయతీ అభివృద్ధికి సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. పదవి లేకున్నా గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. గ్రామం కోసం విశిష్ట సేవలు అందించి పదవి విరమణ పొందుతున్న గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్,పాలకవర్గ సభ్యులను గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామంలో అంబేద్కర్ యూత్ సభ్యులు, గ్రామ ప్రజలు



ఘనంగా పూలమాలలతో శాలువాలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజి సర్పంచ్ ముత్తినేని కోటేశ్వరరావు, మాజి ఉప సర్పంచ్ కృష్ణ, స్పెషల్ ఆఫీసర్ సతీష్, కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, వార్డు సభ్యులు పవన్, రామ నర్సయ్య, రాజయ్య, విజయ్, సైదమ్మ, మల్లీశ్వరి, రాజేశ్వరి, భార్గవి రోజా, ఆశా వర్కర్లు, అంగన్వాడీ సిబ్బంది, గ్రామపంచాయతీ సిబ్బంది బిక్షం, సత్యం, పద్మ, రమాదేవి, చంద్రావు, హై స్కూల్ హెచ్ఎం, ప్రైమరీ స్కూల్ హెచ్ఎం, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


## గద్దర్ విగ్రహానికి ముంబైకర్ల సంఘీబావం

**వాస్తవ నేస్తం,ముంబై:** గొప్ప బహుజనవాది, ప్రజా యుద్ధనౌక గద్దరన్న జయంతి రోజున జరిగిన గద్దర్ విగ్రహం ఆవిష్కరణకు ముంబై మహానగరంలోని బహుజన కులాల నుంచి ఉద్యమ అభినందనలు తెలియజేశారు. హైదరాబాద్ తెల్లపూర్ లో బుధవారం జనవరి 31న అవిష్కర్ణకు ముంబై తెలంగాణ బహుజన ఫోరం తరపున ఆయన త్యాగానికి సెల్యూట్ చేశారు. ఇదేగాకుండా తెలంగాణలోని మెదక్ జిల్లాను గద్దర్ జిల్లాగా ప్రకటించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని వారు కోరారు. జిల్లా నామకరణకు, విగ్రహానికి అభివాదం చేస్తున్న వారిలో ముంబై బహుజన ప్రముఖ నేతలైన కాషవెని చంద్రన్న బెస్త, తడకపల్లి నరేష్ రజక, కల్లూరి లక్ష్మణ్ రజక, భోగ సుదర్శన్ పద్మశాలి, సృష్టి మీడియా ఎడిటర్ చింతల లక్ష్మణ్, ఎడిటర్ బద్ది హేమంత్ కుమార్, నాగుల మల్లేష్ గంగపుత్ర, గవ్వల శ్రీనివాస్ కురుమ, సగణేష్ ముదిరాజ్, కార్మిక నేతలైన సిరిపంగి రవీందర్, చౌవల్ రమేష్, దర్శనం కృష్ణయ్య మహారాజ్, వడ్డి సూర్య నారాయణ, సంటి శంకర్ మహారాజ్, బండు రనావత్ నాయక్, బత్తుల వీరాంజనేయులు గౌడ్, గాయకులు భీంరత్న మాలజీ, మూల్ నివాసి మాలజీ తదితర్లు దిల్సే సంఘీభావం



ప్రకటించారు.

## కాంగ్రెస్ వాళ్లు పాలనను వదిలేసి లంకే బిందెల కోసం గడ్డపారులతో దొంగల్లా తిరుగుతున్నారు




**– బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**వాస్తవ నేస్తం,కుత్బుల్లాపూర్:** నియోజకవర్గంలోని బహదూర్ పల్లి లోని మేకల వెంకటేశం ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన కుత్బుల్లాపూర్ నియోజక వర్గ మల్కాజిగిరి పార్లమెంటరీ సన్నాహక సమావేశానికి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన కేటీఆర్ మాట్లాడుతూ 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు పరుస్తామని చెప్పి గద్దెనెక్కిన ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకుంటే 101 వ రోజు నుంచి బొంద తొవ్వడం మొదలు పెడదామన్నారు. ముఖ్యమంత్రి పదవి చేపట్టిన నాటినుండి కేసీఆర్ని బదనాం చేయడం తప్ప రేవంత్ రెడ్డి చేసే పని ఏమీ లేదన్నారు. అనంతరం ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పదెళ్ల కాలంలో నియోజకవర్గ అభివృద్ధితో కుత్బుల్లాపూర్ ముఖచిత్రాన్ని మార్చామని, చేసిన అభివృద్ధితో రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో కుత్బుల్లాపూర్ నుంచి అత్యధిక ఓటింగ్ చేసుకుంటూ మల్కాజ్గిరి అభ్యర్థిని గెలిపించుకుంటామన్నారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన యాభై రోజుల్లోనే ఈ పాలనలో తెలంగాణ ప్రజలు విసిగివేజారి మాకొద్దు ఈ ప్రభుత్వము అనే స్థాయికి తీసుకొచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి కి చెందిన కార్పొరేటర్లు, నిజాంపేట్ కార్పొరేషన్ మేయర్, దుండిగల్ - కొంపల్లి మున్సిపాలిటీ చైర్మన్లు, పార్టీ అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు నియోజకవర్గానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాక

**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** నేడు పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అధ్యక్షతన జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్ లో జరిగే బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు నాయికోటి రాజేష్ ఓ ప్రకటనలో తెలియజేశారు. ఇట్టి సమావేశానికి ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీలు, సొసైటీ చైర్మన్లు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.



## తమిళ రాజకీయాలు మారుతున్నాయా...

**చెన్నై :** తమిళనాట తిరుగులేని హీరోగా రాణించిన దళపతి విజయ్ తాజాగా 'తమిళగ వెట్రి కళగం' పేరిట ఓ రాజకీయ పార్టీని స్థాపించారు. ఈ పరిణామం తమిళనాడులో మాత్రమే కాకుండా మొత్తం దేశ రాజకీయాల్లోనే సంచలనంగా మారింది. గతంలో తమిళనాట సినీ ప్రముఖులు రాజకీయాల్లో రాణించిన చరిత్ర ఉంది. మరి విజయ్ అదే కోవలోకి వెళ్తారా..? లేదంటే సినిమాల్లో టాప్ హీరోగా రాణించినట్లే.. రాజకీయాల్లోనూ సత్తా చాటుతారా..? అన్నది వేచి చూడాలి. కరుణానిధి, ఎంజీఆర్, జయలలిత వంటి సినీ ప్రముఖులు తమిళనాట రాజకీయాలను శాసించారు. ఇక కమల్ హాసన్, విజయకాంత్ వంటి హీరోలు పార్టీ పెట్టి పెద్దగా రాణించలేకపోయారు. విజయ్ ఎవరికి సరసన నిలుస్తారన్నది చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం తమిళనాడులో డీఎంకే అధికారంలో ఉండగా.. విపక్షంలో ఏఐడీఎంకే ఉంది. దివంగత నేత కరుణానిధి నిష్క్రమణ అనంతరం స్టాలిన్ ఎంతో విజయవంతంగా పార్టీని నడిపిస్తున్నారు. అయితే జయలలిత మృతి చెందిన తర్వాత తమిళనాడులో పొలిటికల్ గ్యాప్ ఏర్పడింది. అన్నా డీఎంకేను సమర్థంగా నడిపించే లీడర్లు ఎవరూ కనిపించడం లేదు. ఆ గ్యాప్‌ను పూడుద్దామని బీజేపీ భావించినప్పటికీ పెద్దగా వర్కవుట్ కాలేదు. అందుకే విజయ్ దీన్ని మంచి సమయంగా ఎంచుకున్నారు. వచ్చే లోక్ సభ ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేయడం లేదని విజయ్ ప్రకటించారు. ఆ తర్వాత జరగబోయే అసెంబ్లీ ఎన్నికలనే ఆయన టార్గెట్‌గా పెట్టుకున్నారు. సహజంగా తమిళ ప్రజలు స్వాభిమానులు.. జాతీయ పార్టీలను కనీసం దరిదాపుల్లోకి కూడా రానివ్వరు. అందుకే తమిళనాట కాంగ్రెస్, బీజేపీ పెద్దగా ప్రభావం చూపలేకపోయాయి. ద్రవిడ మూలాలున్న డీఎంకే, అన్నా డీఎంకే మాత్రమే ఆ రాష్ట్రంలో దశాబ్దాల పాటూ రాజకీయాలను శాసించాయి. ఇక తాజాగా విజయ్ అదే ఆశతో సొంత పార్టీని స్థాపించారు. ప్రస్తుతం తమిళ ప్రజలకు డీఎంకే పెద్ద ఆశగా ఉంది. ఆ తర్వాత వారికి ప్రత్యామ్నాయంగా ఏ పార్టీ కనిపించడం లేదు. ఈ అవకాశాన్ని విజయ్ సద్వినియోగం చేసుకోవాలని భావించారు. అయితే గతంలో తమిళ ప్రజల అస్థిత్వం కోసం పుట్టుకొచ్చిన అనేక పార్టీలు కాలగర్భంలో కలిసిపోయాయి. కమల్ హాసన్, విజయ్ కాంత్ పార్టీలు పెట్టి బొక్క బోర్లా పడ్డారు. కేవలం ఎంజీఆర్ ఒక్కరే తమిళనాట పార్టీ పెట్టి సక్సెస్ ఫుల్‌గా నడిపారు. కరుణానిధి అప్పటికే ఉన్న పార్టీని తన చేతుల్లోకి తీసుకున్నారు. జయలలిత విషయంలోనూ అదే జరిగింది. అయితే ప్రస్తుతం తమిళనాటు విజయ్ అగ్రహీరో. తమిళనాడు వ్యాప్తంగా ఆయనకు అభిమానులు ఉన్నారు.

## సంపాదకీయం

# విలువలు లేని పాలక పార్టీలు!

పాలక పార్టీలైన జాతీయ పార్టీలకు, ప్రాంతీయ పార్టీలకు, ఆ పార్టీల నాయకులకు కనీసం బూర్జువా విలువలు కూడా లేకుండాపోయాయి. ఎలాగైన తాము, తమ పార్టీ అధికారంలో ఉండాలి. అందుకోసం ఏమైనా చేస్తాం, ఎవరితోనైనా కలుస్తాం, పార్టీలను విలీనం చేస్తాం, పార్టీలను మారుస్తామని సిగ్గు లేకుండా వ్యవహరిస్తున్నాయి. వారు 'పవిత్రంగా' భావించే రాజ్యాంగానికే తూట్లు పొడుస్తున్నాయి. మతం, కులం, తెగలను, ప్రాంతీయతను రెచ్చగొడుతూ ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తున్నాయి. బిజెపి నాయకత్వాన అధికారంలో ఉన్న ఎన్‌డిఎ కూటమి హిందు మతం, హిందుత్వ అనే దాన్ని తన అధికారానికి సోపానంగా ఎంచుకుంది. అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి హిందు మత ప్రచారం చేస్తూ, మైనారిటీ మతాలకు వ్యతిరేకంగా హిందువులను రెచ్చగొడుతున్నది. మైనారిటీ మత ప్రజలు దేశ ప్రజలు కాదనే భావన ప్రజల్లో కలిగించే ప్రయత్నం చేస్తున్నది. బాబ్రీ మసీదు కూల్చివేత, రామ జన్మ భూమి పేరుతో అయోధ్యలో రామాలయ ఏర్పాటు, అట్టహాసం ప్రారంభం, బాల రాముని విగ్రహ ప్రతిష్ట, అందుకు వందల కోట్ల రూపాయల ఖర్చు, పెద్దఎత్తున ప్రభుత్వ యంత్రాంగాన్ని వినియోగించడం, దేశ వ్యాప్తంగా ఒక పూట సెలవు ప్రకటించడం అందుకు స్వయంగా ప్రధాని మోడీనే కార్యక్రమానిక నాయకత్వం వహించడం ప్రత్యేకత సంతరించుకుంది. భారత రాజ్యాంగాన్ని గొప్ప లౌకిక, ప్రజాస్వామికమైనదిగా పాలక పార్టీలన్నీ కీర్తిస్తూ ప్రచారం చేస్తున్నాయి. మత వ్యవహారాల్లో ప్రభుత్వ జోక్యం ఉండరాదని, అది ప్రజల విశ్వాసానికి సంబంధించిందని భారత రాజ్యాంగంలో చెప్పడం జరిగింది. రాజ్యాంగ పరిరక్షణగా ఉన్న ప్రభుత్వం దాన్ని పాటించాలి. గత పాలకులు పరోక్ష పద్ధతుల్లో అందుకు తిలోదకాలు ఇవ్వగా, మోడీ ప్రభుత్వం 'పవిత్ర' రాజ్యాంగాన్ని పక్కన పెట్టింది. ఒక మతానికి ప్రచారకులుగా ప్రాంతీయ పార్టీలు కూడా వ్యవహరిస్తున్నాయి. మత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం ఒక అంశమైతే, వారు నమ్మే పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని కూడా ఏ మాత్రం పాటించడం లేదు. అధికారంలోకి ఎలా రావాలి, ఏ పార్టీలతో పొత్తులు పెట్టుకోవాలి, ప్రతిపక్ష ప్రభుత్వాలను ఎలా కూల్చాలి. ఇతర పార్టీల సభ్యులను ఎలా ప్రలోభపెట్టి తమ పార్టీలో చేర్చుకోవాలి, ఒక కూటమిని మరొక కూటమి ఎలా విచ్ఛిన్నం చేయాలి అన్నకుట్రలు, కుతంత్రాలతో మునిగితేలుతున్నాయి. ఇందు లో బిజెపి అగ్రస్థానంలో ఉంది. ప్రతిపక్ష, ప్రాంతీయ పార్టీల ఎంపిలను, ఎంఎల్‌ఎలను ప్రలోభాలతో తనవైపుకి తిప్పుకుని రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చడం, వారి మద్దతుతో ప్రభుత్వాల ఏర్పాటే లక్ష్యంగా ముందుకు సాగుతున్నది. పార్లమెంట్, శాసనసభ సభ్యులు మరొక పార్టీలోకి ఫిరాయిస్తే వారి సభ్యత్వం రద్దు అవుతుందని పార్లమెంట్ చట్టం చేయడం జరిగింది. స్పీకర్‌ను అడ్డం పెట్టుకుని అధికార పార్టీ దీన్ని తనకు అనుకూలంగా ఉన్న వారికి వర్తింపచేయకుండా అడ్డుపడుతున్నది. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రతిపక్షంలో ఉన్న పార్టీ సభ్యులకు మాత్రమే వర్తింపు జరుపుతున్నది. దీన్ని గమనిస్తే అధికారంలో ఉన్న పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని ఎలా అపహాస్యం చేసేది తెలుపుతున్నది. ఎన్నికలు దగ్గరపడిన సమయంలో వివిధ పార్టీలతో కూడిన ఫ్రంట్‌లు ఏర్పడ్డాయి. ఎన్‌డిఎ కూటమిలో అదనంగా కొన్ని పార్టీలు చేరాయి. కాంగ్రెస్‌తో కలసి 28 పార్టీలు 'ఇండియా' కూటమిగా ఏర్పడి ఎన్‌డిఎను ఎన్నికల్లో ఎదుర్కొంటామని ప్రకటించాయి. దీనికి సమన్వయ కర్తగా బీహార్ ముఖ్య మంత్రి నితీశ్ కుమార్ వ్యహరించాడు. 'ఇండియా' కూటమిలో ప్రాంతీయ పార్టీలే ఎక్కువగా ఉన్నాయి. ఈ కూటమిలో సిపిఐ, సిపిఐ(ఎం) పార్టీలూ చేరాయి. ఈ కూటమి లక్ష్యం ఎన్‌డిఎను ఓడించడం. ఈ కూటమిలోని అనేక ప్రాంతీయ పార్టీలకు కాంగ్రెస్‌కు మధ్య విభేదాలతో పాటు సీట్ల సర్దుబాటు తీవ్రసమస్యగా ముందుకు వచ్చింది. అఖిలేశ్ యాదవ్ కాంగ్రెస్‌తో పొత్తు ఉండదని ప్రకటించారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ప్రకటన కూడా అలాగే ఉంది. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కాంగ్రెస్‌తో ఎన్నికల సర్దుబాటును వ్యతిరేకించింది. 'ఇండియా' కూటమి రెండు మూడు సార్లు సమావేశమై మల్లికార్జున ఖర్గేను ప్రధాన మంత్రి అభ్యర్థిగా ఎక్కువ మంది బలపర్చారు. మమత, కేజ్రీవాల్ కూడా ఖర్గేకి మద్దతు ప్రకటించారు. ఈ పరిణామానికి ముందు జరిగిన ఎన్నికల్లో కూటమిలోని పార్టీలకు కాంగ్రెస్ సీట్లను కేటాయించక పోవడం, నాలుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఓడిపోవడంతో 'ఇండియా' కూటమిలో విభేదాలు తీవ్రమయ్యాయి. కూటమి ప్రధాని అభ్యర్థిగా ఖర్గేను ప్రకటించడం నితీశ్ కుమార్‌కు ఏమాత్రం ఇష్టం లేదు. దాంతో 'ఇండియా' కూటమి నుండి బయటకు రావాలనే నిర్ణయానికి వచ్చారు. ఎన్‌డిఎ కూటమిని ఎదుర్కోవడానికి ఆ కూటమి నుండి బయటకు వచ్చి 'ఇండియా' కూటమి ఏర్పాటుకి ముఖ్య భూమిక వహించిన నితీశ్ కుమార్ తిరిగి బిజెపి కూటమిలో చేరాలని నిర్ణయం తీసుకుని కాంగ్రెస్, ఆర్‌జెడితో కలసి ఏర్పాటు చేసిన ప్రభుత్వ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి 'ఇండియా' కూటమి నుండి బైటకు వచ్చారు. బిజెపితో కలసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి తిరిగి ముఖ్యమంత్రి అయ్యారు. సుదీర్ఘ కాలం ముఖ్యమంత్రిగా ఉన్న నితీశ్ కుమార్ పదవే పరమావధిగా భావిస్తూ అనేక పార్టీలతో కలిసి ప్రభుత్వాలను ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి పదవి చేపట్టారు. 'ఇండియా' కూటమిలో ప్రధానమంత్రి అభ్యర్థిగా తానే ఉంటాననే భావించించారు. అది జరగకపోయేసరికి ఎన్‌డిఎ పంచనచేరారు. దీన్ని గమనిస్తే ఆయన ఊసరవెల్లి రాజకీయాలు, పదవీకాంక్ష, అవకాశవాదం వెల్లడిఅవుతుంది. ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్‌ఆద్మీ పార్టీ అధినేత కేజ్రీవాల్ ఇందుకు మినహాయింపు కాదు. కాంగ్రెస్‌ని వ్యతిరేకించడం, సమర్థించడం అనే ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నారు. నేడు కాంగ్రెస్‌తో పొత్తు ఉండదని ప్రకటించారు. తన ప్రభుత్వంపై అనేక అవినీతి కుంభకోణాల కేసులు ఉన్నాయి. వాటి నుండి బయటపడడానికే కాంగ్రెస్‌తో పొత్తును వ్యతిరేకించడం. 'ఇండియా' కూటమిలో కాంగ్రెస్ పెద్ద పార్టీ. అది ఇతర పార్టీలను కలుపుకుపోవడంలో వైఫల్యం చెందింది. ఒంటెత్తు ధోరణితో వ్యవహరించింది. తన ప్రజా వ్యతిరేక విధానాలతో అధికారానికి దూరమైంది. అత్యంత బలహీనంగా మారింది. ఈ పార్టీలో అనైక్యత తరచూ వ్యక్తమవుతున్నది. 'ఇండియా' కూటమిని ముందుకు నడిపించే సామర్థ్యాన్ని కోల్పోయినా పెద్దన్న పాత్రను కోరుకుంటున్నది. భారత రాజ్యాంగ పరిధిలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ద్వారా అధికారంలోకి వచ్చి సోషలిజాన్ని సాధిస్తామని చెబుతున్న సిపిఐ, సిపిఐ(ఎం) పార్టీలు అందుకోసమైనా స్వతంత్ర పార్లమెంటరీ విధానాలను ఎందుకు ఆచరించడం లేదు. స్వతంత్రంగా ఎందుకు పోటీ చేయడంలేదు? ఏదో ఒక పాలక పార్టీతో ముడివేసుకుని ఎందుకు నడుస్తున్నాయి? పార్లమెంటరీ 'ప్రజాస్వామ్యం'లో గెలవడానికైనా ప్రజాఉద్యమాలు ఎందుకు చేపట్టలేకపోతున్నాయి? ఎన్‌డిఎ కూటమిని ఓడించాలనుకుంటున్న పార్టీలు అందుకు అనుగుణంగా ఎందుకు వ్యవహరించలేకపోతున్నాయి? ప్రజలను పేదరికం నుండి బయటపడేందుకు వారి ఆర్థిక పరిస్థితులను మెరుగుపరుస్తామని అన్ని పాలక పార్టీలు చెబుతున్నాయి. ఎలా మెరుగుపరిచేది చెప్పడం లేదు. దేశ సంపద కొద్ది మంది సంపన్నుల వద్ద పోగుపడి ఉంది. పాలక పార్టీల నాయకులు వేల కోట్ల రూపాయలకు అధిపతులుగా ఉన్నారు. బడాభూస్వాముల, ఎస్టేట్‌దారుల వద్ద పెద్ద ఎత్తున భూములు వున్నాయి. సంపన్నవర్గాల వద్ద పోగుబడిన సంపదను, బడాభూస్వాముల వద్ద ఉన్న భూములను పేదలకు పంచినప్పుడే వారు పేదరికం నుండి బయటపడతారు. ఇలాంటి విధానాలు అమలు జరుపుతామని ఏ పాలక పార్టీ చెప్పడం లేదు. పేదరికం గురించి పాలక పార్టీలు మాట్లాడడమంటే వారిని మభ్యపెట్టి మోసగించడమే. జాతీయ పార్టీలైనా, ప్రాంతీయ పార్టీలైనా ఒకే ఆర్థిక, రాజకీయ విధానాలు అమలు జరుపుతున్నాయి. సామ్రాజ్యవాదుల, బడా పెట్టుబడిదారుల, బడా భూస్వాముల దోపిడీకి అనుకూలమైన విధానాలనే అమలు జరుపుతున్నాయి. ఇందులో ఎటువంటి మినహాయింపులు లేవు. వారి ప్రయోజనాలు కాపాడడానికి మేమంటే మేము అధికారంలో ఉంటామని మాత్రమే తగవులు పడుతున్నాయి. ఈ వాస్తవాలను గమనించి పాలకుల విధానాలకు వ్యతిరేకంగా అన్ని రకాల దేశ సహజ వనరులు, సంపదలు, భూములు తమకే చెందాలని ప్రజలు ఉద్యమించాలి.

# పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయాలి

## - ప్రభుత్వ విద్యారంగా సమస్యలను పరిష్కరించాలి

## - ఏ.ఐ.యస్.బి మంచిర్యాల్ జిల్లా ప్రధానకార్యదర్శి అల్లి సాగర్

**వాస్తవ నేస్తం,బెల్లంపల్లి:** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణ ఏరియాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏ.ఐ.యస్.బి జిల్లా ప్రధనకార్యదర్శి అల్లి సాగర్ మాట్లాడుతూ... రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది కాని పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. బకాయిలు రాక చాలామంది విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ విద్యారంగా సమస్యలను పరిష్కరించాలి, ప్రభుత్వ పాఠశాలలోని మౌలిక సమస్యలతో కొట్టుమిట్టాలాడుతున్నాయని, కనీస భవనాలు, ఫర్నిచర్, ఉపాధ్యాయులు మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం లేక విద్యార్థులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వ జూనియర్ డిగ్రీ కళాశాలలో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు విద్యకు అందని ద్రాక్ష లాగా ఉందని, జూనియర్, డిగ్రీ కళాశాలలో మధ్యాహ్న భోజనం అందించాలని, సంక్షేమ వసతి గృహాలకు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో ఉంటున్నాయని, కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. యూనివర్శిటీలలో పరిస్థితి కూడా అధ్వానంగా ఉన్నాయని, అధ్యాపక కొరత సమస్యలతో పేరుకుపోయి ఉందని, మోడల్ స్కూల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను రెగ్యులరైజేషన్ చేయాలని వాటిని అభివృద్ధి పరచాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కంప్యూటర్ విద్యను ప్రవేశపెట్టాలి అని కొరారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి అమలు చేయాలని, ఉద్యోగ నోటిఫికేషన్ తక్షణమే విడుదల చేయాలి అని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు వంశీ, బిందు, గీత, సాగరిక, శ్రీకాంత్, సాగర్, స్రవంతి, లడ్డు తదితరులు పాల్గొన్నారు.




# ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

## - బోథ్ జూనియర్ సివిల్ జడ్జి బి హుస్సేన్

**వాస్తవ నేస్తం,ఇచ్చోడ:** ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని బోథ్ జూనియర్ సివిల్ జడ్జి బి హుస్సేన్ అన్నారు. మండలంలోని బాబ్జిపేట్ గ్రామంలో శనివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పిల్లలకు చిన్నప్పటి నుండే చట్టాల పైన అవగాహనా కలిగించాలని అన్నారు. పిల్లలను తప్పకుండ బడికి పంపాలని,18 సంవత్సరాలు నిండిన వారు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని అన్నారు. మోటారు వెహికిల్ చట్టం, బాల్యవివాహాలు, వరకట్నం, బాల కార్మిక నిర్మూలన, విద్యాహక్కు చట్టాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ టెక్కం దేవురావ్, ఎస్సై నరేష్, బార్ అసోసియేషన్ సెక్రటరీ పంద్రం శంకర్, కుమ్మరి విజయ్ కుమార్, గ్రామ పెద్దలు ఆనందరావ్, చందర్, భీంరావ్, బాపూరావ్, మనిరం, గుండాల రమేష్, గ్రామప్రజలు పాల్గొన్నారు.



# అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మాయమాటలు చెప్పి గెలిచింది

**- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**వాస్తవ నేస్తం,కూకట్‌పల్లి:** నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని శనివారం కూకట్‌పల్లిలోని ఎన్.కే.ఎన్.ఆర్ గార్డెన్స్ లో నిర్వహించారు. ఈ కార్య్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆ హామీలను నెరవేర్చకుండా పాలన సాగిస్తున్నదని అన్నారు. తాము వంద రోజుల పాటు వేచి చూస్తామని, ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే ప్రజలతో కలిసి ప్రజా ఉద్యమాలు చేపడుతామని తెలిపారు. ఫ్రీ బస్ పథకానికి తాము వ్యతిరేకం కాదని, కానీ సరైనన్ని బస్సులు లేకుండా పథకం అమలు చేయటం వల్ల బస్సులలో ప్రయాణించే మహిళలు, పురుషులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఫ్రీ బస్ పథకం వల్ల ఆటో డ్రైవర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ రోజు వరకు 16 మంది ఆత్మహత్య చేసుకున్నారని, రాష్ట్రంలోని ఆటో డ్రైవర్లకు ప్రతి నెల పదివేల రూపాయలు సహాయం అందించాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ లో తెలంగాణ గళం వినిపించాలంటే రానున్న ఎన్నికలలో బిఆర్ఎస్ అభ్యర్థులను ఆదరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ ఈనాడు కూకట్పల్లి నియోజకవర్గంలో భారీ మెజారిటీతో తాను గెలిచాను అంటే దానికి కేటీఆర్,నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమమే ముఖ్య కారణమని అలాగే ఎంతో నిబద్ధతతో పనిచేసే కూకట్పల్లి నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలే నాకు అండగా ఉండి ఇంత మెజారిటీ సాధించడానికి కృషి చేశారని వారిని ఎప్పటికీ మర్చిపోనని.. ఈ సందర్భంగా కూకట్పల్లి నియోజకవర్గానికి గతంలో పదవుల పంపకం విషయంలో కొంత అన్యాయం జరిగిందని భవిష్యత్తులో కూకట్పల్లి నియోజకవర్గంకు పెద్దపీట వేయాలని కోరగా దీనికి కేటీఆర్ సానుకూలంగా స్పందించారు. అలాగే ఎంతో విజన్ ఉన్న నాయకుడు కేటీఆర్ అని భవిష్యత్తులో కాబోయే ముఖ్యమంత్రి ఆయనేనని అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మరోసారి కూకట్పల్లి నియోజకవర్గం నుంచి భారీ మెజారిటీ అందిస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు శంబిపూర్ రాజు, కూకట్పల్లి నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ సతీష్ అరోరా, నియోజకవర్గ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, మహిళా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.




# జీవ వైవిధ్య కేంద్రాలు..

సముద్రం, నది, ఇతర నీటి వనరుల తీర ప్రాంతాలలో లోతు తక్కువ వుండి ఎక్కువ కాలం నీటి నిల్వ వుండే భూములను చిత్తడి నేలలు అంటారు. మంచి నీటి సరస్సులు, ఉప్పునీటి సరస్సులు, మడ అడవులున్న తీర ప్రాంతాలన్నీ చిత్తడి నేలలే. ఎగువ ప్రాంతంలోని భూములు అలల తాకిడికి దెబ్బ తినకుండా ఈ చిత్తడి నేలలు అడ్డు కట్ట వేస్తాయి. అరుదైన మొక్కలకు, పక్షులకు, జంతువులకు, చేపలు గుడ్లు పెట్టడానికి ఈ చిత్తడి నేలలు చాల అనుకూలం. సమీప నీటి నాణ్యతను పెంచడం లోను, కాలుష్య కారకాలను గ్రహించడం లోను చిత్తడి నేలలు ప్రాధాన్యతను పోషిస్తాయి. మానవుల తప్పిదాలతో పర్యావరణానికి చాల హాని కలుగు తున్నది. అలాగే చిత్తడి నేలలకు కూడా మినహాయింపు లేకుండా పోతున్నది. ఫలితంగా హాని జరుగు తున్నది. ప్రజలు వ్యవసాయ అవసరాలకు ఈ భూములను ఆక్రమించు కొని రసాయన ఎరువులకు వాడడం వల్ల.... నివాస యోగ్యానికి ఈ నేలలను పూడ్చడం తోను, చిత్తడి నేలలు విధ్వంసానికి గురవు తున్నాయి. ప్రభుత్వం పరిశ్రమల కొరకు చిత్తడి నేలలను కేటాయిచడంలో అవి మరింత విధ్వంసానికి గురవు తున్నాయి. చిత్తడి నేలల పరిరక్షణకు 1971, ఫిబ్రవరి రెండవ తేదీన ఇరాన్ లోని రాంసార్ లో ఒక అంతర్జాతీయ సదస్సు జరిగింది. అప్పుడు తీసుకున్న ఉమ్మడి ఒప్పందం పై 164 దేశాలు సంతకం చేశాయి. దాన్నే "రాంసార్ ఒప్పందం" అంటారు. చిత్తడి నేలల పరిరక్షణకు ఈ ఒప్పందంలో కొన్ని ప్రమాణాలను నిర్దేశించారు. భారత దేశం కూడా ఈ ఒప్పందం పై సంతకం చేసింది. చిత్తడి నేలలు జీవ వైవిధ్యానికి కేంద్రాలు. ఈ ప్రదేశాలలో చాలా జల చర, ఉభయ చర జీవులు... మొక్కలు, జంతువులు ఉంటాయి. చిత్తడి నేలలు ముఖ్యంగా నదీ పరీవాహక ప్రదేశాలు, సముద్ర తీర ప్రాంతాల కు సమీపంగా ఉంటాయి. ఇవి నదుల గుండా వచ్చే కాలుష్య కారక పదార్థాలను, తమలో ఇముడ్చు కుంటాయి. సముద్ర భారీ అలల నుండి సునామీల నుండి తీర ప్రాంతాలను రక్షిస్తాయి. అదే విధంగా నదుల వరదల నుండి కాపాడుతాయి. సముద్ర ప్రాంతాలు, నదీ తీరాలు, చెరువులు, సరస్సులు, నీటి ముంపు ప్రాంతాలు, తీరాల సమీపంలోని ఉప్పునీటి కయ్యలు, మడ అడవులు, మానవ నిర్మిత చేపల చెరువులు, వరి పొలాలు, సాగునీటి ఆనకట్టలు వంటివి చిత్తడి నేలల కోవకు చెందుతాయి.

http://vaasthavanestham.com
# వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



## బీజేపీ పార్టీ తీర్థం పుచ్చుకున్న జిల్లా పరిషత్ చైర్మన్ రాథోడ్ జనార్ధన్



**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** జిల్లా టిఆర్ఎస్ పార్టీ తరఫున 2019 సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో నార్నూరు మండల్ నుంచి జడ్పిటిసిగా ఎన్నికై జిల్లా పరిషత్ చైర్మన్ గా ఎన్నికైన రాథోడ్ జనార్ధన్ గత నాలుగున్నర సంవత్సరాల నుంచి టీఆర్ఎస్ పార్టీలో ఉన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఖానాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే టికెట్ ఆశించిన ఆయనకు టికెట్ రాకపోవడంతో నిరాశకు గురై గత కొంతకాలంగా బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమాలకు అంటి ముట్టి నట్టు ఉంటున్నారు. గత వారం క్రితమే అయినా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్టు చర్చలు జరిగాయి. శనివారం ఉట్నూర్ మండల కేంద్రం నుంచి తన అనుచరులు, కార్యకర్తలు, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ తో కలసి హైదరాబాద్ కు బయలుదేరి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కేంద్ర మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి, ఈటెల రాజేందర్ సమక్షంలో భారతీయ జనతా పార్టీలో చేరి కమలం పార్టీ కండువని కప్పుకున్నారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ సరి అయిన సమయంలో ఆదిలాబాద్ జిల్లా పరిషత్ చైర్మన్ జనార్ధన్ రాథోడ్ నిర్ణయం తీసుకున్నారని దీనికి భారతీయ జనతా పార్టీ వారి యొక్క నిర్ణయాన్ని స్వాగతిస్తుందని అన్నారు. మరి జనార్ధన్ రాథోడ్ డ్ భారతీయ జనతా పార్టీలో చేరడంతో ఆదిలాబాద్ జిల్లాలో కాషాయ జెండా ఎగరవేడం ఖాయమని అన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి... ఒకరికి తీవ్ర గాయాలు



**వాస్తవ నేస్తం,ఇచ్చోడ:** రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం. కేరళకు చెందిన సమీర్, అబ్దుల్ కరీం అనే ఇరువురు ఐచర్ వాహనంలో మహారాష్ట్రలోని అమరావతి నుండి కేరళకు సంతర్ పండ్లు తీసుకొని వెళ్తున్న క్రమంలో శుక్రవారం తెల్లవారుజామున మండల కేంద్రం గుండా వెళ్తున్న జాతీయ రహదారిపై, చర్చికి సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో సమీర్, కరీం కు తీవ్ర గాయాలవ్వగా చికిత్స కోసం రిమ్స్ కు తరలించారు. తీవ్ర గాయాలైన సమీర్ చికిత్స పొందుతూ రూమ్స్ లో మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుని తమ్ముడి ఫిర్యాదు మేరకు కేసు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. గుర్తుతెలియని వాహనాన్ని పట్టుకొనుటకు ప్రత్యేక బృందం నియమించినట్లు ఎస్సై తెలిపారు.

## పార్లమెంట్ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న కోట్నాక్ తిరుపతి



**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** కాంగ్రెస్ పార్టీ నుండి ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా కోట్నాక్ తిరుపతి శనివారం గాంధీభవన్ లో దరఖాస్తు చేసుకున్నారు. అధిష్టానం తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించి జరగబోయే పార్లమెంటు ఎన్నికల్లో తనకు ఎంపీ టికెట్ కేటాయించాలని కోరారు. కోట్నాక్ తిరుపతి ఏఐసిసి నేషనల్ కోఆర్డినేటర్ ఆదివాసి విభాగానికి పనిచేస్తున్నారు. ఏఐసీసీ, టీపీసీసీ ఇచ్చిన కార్యక్రములను విజవంతంగా నిర్వహిస్తుంటారు. గత సంవత్సరం రాహుల్ గాంధీ చేపట్టిన భారజోడో యాత్రలో కోట్నాక తిరుపతి పాల్గొని కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు రాహుల్ గాంధీతో కలిసి పాదయాత్రలో పాల్గొన్నారు. ఆదివాసి నాయకుడుగా తమకు ఎంపీ టికెట్ కేటాయింపులో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

## ఎంపీ టికెట్ కోసం ఏఐసీసీ సభ్యులు నరేష్ జాదవ్ దరఖాస్తు

**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** ఏఐసీసీ సభ్యులు ఆదిలాబాద్ పార్లమెంట్ కోఆర్డినేటర్ నరేష్ జాదవ్ ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా శనివారం గాంధీభవన్ లో టీపీసీసీ ఉపాధ్యక్షుడు కుమార్ రావుకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా నరేష్ జాదవ్ మాట్లాడుతూ.. గతంలో ఎంపీగా పోటీ చేసిన అనుభవం తనకు ఉందని, ఈసారి అధిక మెజార్టీతో ఎంపీగా గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. అధిష్టానం తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించి తనకు ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో గోవింద నాయక్, విద్యాసాగర్, సురేష్, కాంగ్రెస్ నాయకులు, తదితరులు ఉన్నారు.



## కార్మికుల పక్షాన పోరాటం చేసేది ఏఐటియుసీ - ఏఐటియుసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్

**వాస్తవ నేస్తం,ఇచ్చోడ:** మండల కేంద్రంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఏఐటియుసీ జిల్లా కౌన్సిల్ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏఐటియుసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్మికుల పక్షాన ఎల్లప్పుడు ఏఐటియుసీ పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్ల ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గాజంగుల రాజు, ఏఐటీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కుంటాల రాములు, జిల్లా ఉపాధ్యక్షురాలు చంద్రకళ, జిల్లా సహాయ కార్యదర్శి కల్లేపల్లి గంగయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




## నేడు పూర్వ విద్యార్థుల సమ్మేళనం




**వాస్తవ నేస్తం,ఇచ్చోడ:** నేడు 1998-99 ఎస్ఎస్సి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు పూర్వ విద్యార్థి శ్యాంసుందర్ తెలిపారు. పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సిల్వర్ జూబ్లీ 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బోధించిన గురువులు సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమ్మేళనానికి 150 మంది పూర్వ విద్యార్థులు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు.

## శుభోదయం...సుభాషితం

వసుదేవుడే ఒకనాడు
...పట్టలేదా గాడిద కాళ్ళు
కోదండ రాముడే ఒకనాడు
...కోరలేదా కోతులఅండ
పట్టుతప్పిన పామైనా
...పట్టక తప్పదురా కప్పకాళ్ళైనా
అన్న పోలన్న సుభాషితం..!
విన్న మీకు శుభోదయం...!!



క్రమశిక్షణ సత్ప్రవర్తన
...ఏకాగ్రత ఉన్న ఎదురే లేదురా
పట్టుదల కృషి దీక్షగలవాడే
...ప్రతిభావంతుడురా
ప్రతిభావంతుడే ప్రచండభానుడై
...నిత్యం ప్రకాశించునురా
అన్న పోలన్న సుభాషితం..!
విన్న మీకు శుభోదయం...!!

పోలయ్య కవి కూకట్లపల్లి హైదరాబాద్

## గావ్ చలో అభియాన్ - పల్లెకు పోదాం అభియాన్

**వాస్తవ నేస్తం,బెల్లంపల్లి:** తాండూరు మండల కేంద్రము లోని ఐ.బీ బీజేపీ కార్యాలయంలో జరిగిన గావ్ చలో అభియాన్ - పల్లెకు పోదాం అభియాన్ కార్యక్రమంలో భాగంగా తాండూరు మండల బీజేపీ అధ్యక్షుడు రామగౌని మహీధర్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కార్యదర్శి మాసు రజినీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బిజెపి పార్టీ కేంద్రంలో బలోపేతంగా ఉందని రానున్న పార్లమెంటు ఎన్నికల్లో దేశంలోని అన్ని రాష్ట్రాల్లో కూడా బిజెపి పార్టీ అభ్యర్థులు గెలుపొందుతారని రానున్నది రామరాజ్యం మోడీ రాజ్యమని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి మండల నాయకులు ప్రతి ఒక బీజేపీ కార్యకర్త ప్రతి గ్రామంలో ప్రచారం చేయాలని పూర్తిస్థాయిలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రతి గడప గడప తీసుకెళ్లాలని కోరారు. గ్రామాలలో రానున్న ఎన్నికల కోసం పల్లెనిద్రల ద్వారా ప్రజలకు చేరువవుతామని రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను నిలదీస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు చిలువేరి శేషగిరి, మండల ప్రధాన కార్యదర్శి దూడపాక భరత్, ఉపాధ్యక్షులు పుట్ట కుమార్, మండల అధికారప్రతినిధి సిద్దం మల్లేష్, కోశాధికారి రాచర్ల సురేష్, గావ్ చలో అభియాన్ మండల కో కన్వీనర్ శ్రావణ్, మధు భూత్ అధ్యక్షులు, కార్యకర్తలు నాయకులు తదితర నాయకులు పాల్గొన్నారు.



Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, RNI NO: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com